# నీళ్లలోని చేప

బాలసుధాకర్ మౌళి

చంపావతి ప్రచురణలు

Neellaloni chepa
Poetry
balasudhakar mouli

Champaavathi Prachuranalu-3
e-mail : champaavathi@gmail.com

First Edition:
July 2018

*For copies:*
Visalandhra, prajasakthi,
Aneka

*Poet's Address:*
Balasudhakar mouli
Near S.B.I, Boya street,
Nellimarla S.O
Vizianagaram Dt - 535217
Cell : 9676493680, 9505646046

*Book Design :*
Brahmam Bhavana Grafix
Hyderabad, 98482 54745

*Printed at :*
Karshak Art Printers
Hyderabad

Rs. 120/-

ఎనిమిదిన్నరేళ్లుగా
నాలో సృజనకారుణ్ణి బతికిస్తున్న
మా భైరిపురంకి

భైరిపురం స్నేహితులకి

# ఇదీ వరుస!

## 1

ఒక వానాకాలం కథ
మట్టిపొరల్లోంచి
After a long period
ఎండాకాలం
ఒక పిట్ట కథ
సూర్యుడు పొడిచే దిక్కు
తెగుతున్నవి రెక్కలేనా
పడవ పాట
తీరం బతుకు
రహస్యమేదో
కథలు చెప్పే అతను
బుక్కెడు బువ్వ
రెక్కల కష్టంలోనే
ఏడుపొస్తుంది
తల్లి కళ్లు
ఉత్కళ భూమి
ఆకలి నేలలో
వలస
అలలలలుగా
వేకువ దారిలో

## 2


గాయాల పాట
నీళ్లలోని చేప
తురాయిపూల దారిలో
మాయా వృక్షం
అనగనగా ఒక ఆవు
మాత్రమే
ఇప్పుడు
రాలిన కుంకుమ పూవు
పసిపిల్లలు
Wheel chair poem
నిశ్శబ్దంగానో, నిర్మాణంగానో
తూత్తుకుడి
పొలం యాత్ర
నల్లపూలు
ఇంద్రావతి
చంపావతి నుంచి
నజీబ్ తల్లి
ఏం మారలేదు
రెండు విగ్రహాలు
అక్టోబర్ 2
ఒక నెత్తుటి భరోసా తర్వాత
నది చెప్పిన కథ
నదిని దాటుతూ
ఒక గతంలో ఒక వర్తమానంలో
తీరానికి
Poem




## 3


ఏ కెరటం చెరిపేయని
Mourning of heart
తెరిపి/ ముసురు
Struggle of pain
నిశ్శబ్దం ఊయలలో
కాస్తా దూరంలోనే
కాంతి
పునరుత్థానం
నాన్నొచ్చే సందర్భం
కన్నీటి దారిలో
ముసురు
ఒకింత సలపరం
చిప్పిల్లిన కళ్లు
ఒంటరి ఏకాంత దేశంలో
కుదుపు
ఒక కవి దుఃఖం
ఒక ఆధునిక జ్ఞాపకం
రెక్కల్లేని
Unwanted Image - 1
Unwanted Image - 2
అనంతదాహం
గాయం
కలలో మెలకువలో
ఆఫ్రికన్ కవి, నేనూ
ఈ నేలపై

4

వస్తారని
ఎల్లలులేని లోకంలో
ఒక తరగతి గది సందర్భం
పిల్లలు
నేనులేని తరగతి గది
ఒకే స్వప్నం కింద
శివారెడ్డి
అతను
శివారెడ్డి 2
భరోసా వొకటి
వస్తాడు
ఒక కథ
సారం
వర్షం

# 1

ఈసారి కూడా
నడిచొచ్చిన దారి
కొన్ని జ్ఞాపకాలను వదిలిపెట్టింది
పూరి పరిమళం
గాల్లో తేలియాడుతుంది
కనురెప్పల్లోంచి వుబికిన కెరటం
ఇక్కడొక
సముద్రాన్ని సృష్టిస్తుంది

ఈసారి కూడా
భూమి చెమటరంగు పూసుకుని
కదంతొక్కుతుంది
ఊపిరి తెగిన దేహానికి
ఉక్కునరాలను బిగుస్తుంది
వెలిగే కాగడాల వేకువలో
పిడికిళ్లెత్తిన చేతులు
చెమటచుక్కలతో
నేలను ఫలవంతం చేస్తున్నాయి

# ఒక వానాకాలం కథ

ముదురు నలుపు రంగులోకి
చీకటి జారుకుంది
అమ్మ పొయ్యి వెలిగించింది
ఇంటి పైకప్పు ఎర్రపెంకుల వంపుల్లోంచి
ఒకటే ధారగా వర్షం నీళ్లు
నీళ్లు పడే చోట కింద నత్తల బిందెలు
పెరట్లో చెట్లు తలలూపుతున్నాయి
అమ్మ మంటని రాజేసి
కూటికుండని పైకెక్కించి పైన సిబ్బి పెట్టింది
అన్నం ఉడుకుతుంది
నలుగురి ఆకలి తీర్చాల్సిన రాత్రి
బిందెల నుండి
నేల మీదికి తొణుకుతున్న వర్షం నీళ్లు
ఎర్రని వర్షం నీళ్లు

వాన రాత్రి
ఇంటి ముందు కొబ్బరిచెట్టుపైన

గూట్లో పిల్లల రెక్కలు సద్దుదూ సడిచేస్తున్న తల్లికాకి
వీధి సందులోంచి
నిద్రలేని కుక్కల మూలుగు
కాలువలోంచి కప్పల బెకబెక
కీచురాళ్ల రొద
కత్తిపీట కోస్తున్నప్పుడు ఎప్పుడు తెగిందో
అమ్మ బొటన వేని నుంచి నెత్తురు
పొయి మీంచి అన్నం దిగింది
నలుగురు కడుపులు నిండి నిద్రలోకి
జారుకున్నారు

ఆ వర్షం కురిసిన రాత్రి
నులక మంచం కింద కుంపటిలో
అమ్మ గోగుపుల్లలు వెలిగించింది
తడిసిన దేహాన్ని వెచ్చబరుచుకుంటుంది
పొద్దంతా పనిలో నానిన చేతులు
మంటల్లో మొలుస్తూ
కళ్ల మీద వాలుతున్నాయి

నులక మంచంపైన అమ్మ
పక్కన నేను, కింద కుంపటి

ఊరు దాటొచ్చాం
చీకటి వుంది ఆకలి వుంది వర్షమూ వుంది
నిశ్శబ్దం గొంతు వానలో కూరిపోతుంది

రచనా కాలం : 8 అక్టోబర్ 2017

# మట్టిపొరల్లోంచి

1
సారెపై
నానిన మట్టిముద్దని వేసి
కర్రతో తిప్పుతున్నప్పుడే
నిద్రలేచింది ఆకాశం
తడి తడి కుండ ఆకారంలోకి
పోతపోయబడి
నేలమీదికొచ్చాడు సూర్యుడు
ఊరిచివరి ఒంటరి ఇల్లు
ముంగిలిని
మురిపెంగా నాకుతూ పొద్దుటి కాంతి
ఒట్టి మట్టిపిడత ఇల్లు
మిణుకుమిణుకుమంటూ ఇంటిళ్లపాది కళ్లు
ఒక్క జల్లు రాలితే
మట్టిపొరల్లోంచి ఉబికే వాసన
అదిరే ముక్కుపుటాలు
ఆరుబయట

తళతళ మిలమిల
కుండల వరస
మట్టితో నిర్మించబడిన వూరిని
దాటి వచ్చాను

2
ఆకలేస్తుందే అమ్మా
పిర్రలపైకి జారిపోతున్న నిక్కరుని
పైకి లాక్కుంటూ
వచ్చి నిల్చొన్నాడా బుడ్డోడు
ఒంటి నిండా మట్టి
పిక్కలపైకి గుండార లాక్కుని
పొగబట్టిన పొయిలోకి
ఒకటి ఒకటి పేడులు దూరుస్తుందా తల్లి
ఎలితి ఎలితి బతుకు
కూటికుండలోంచి ఎసర
నేలరాలి
సురసురమని
ఆకలి కడుపులో ఆకలి
దాకలోకి
మిరగాయలు చిక్కి
కుసింత నూన పోసిందా అమ్మ
రెండు వుల్లిరెమ్మలు లాగి
కరివేపాకు జల్లింది
ఆకలేస్తుంది
ఆకలి



3
అరికాళ్ల కింద మంట
బొబ్బలెక్కుతూ పాదాలు
వీధి వీధి తిరుగుతుందా మట్టిపొయ్యి
గడప గడపా దిగుతుందా మట్టికుండ
చెల్లని పెంకైపోయిందా మట్టిదాక
ఆకలేస్తుందే అమ్మా
బతుకుల్లో మబ్బు ముసురుకుందిరా నాయనా
ఆకలేస్తుందే తల్లీ
కండ్లల్లో
వొక్క సినుకు పిసర
పడతలేదురా బావూ
బావురుమంది
ఇల్లు

4
సారెపై
మట్టిముద్దలు లేని సారె
ఎండి చిదిగిన పెళ్లలతో గుమ్మం
పెంకులు పెంకులైన
మట్టిబొమ్మలు

5
ఒక్కసారి మాట్లాడావా
ఊరికి ఆలంబనగా నిలిచిన మట్టికేకని
ఒకే ఒక్కసారి

ఇంటిగుమ్మాలు దాటి
లోపలికి వినిపించేట్టు పాడవా
ఆవంలో ఎఱ్రగా మండి మండి
ఊరుఊరంతటినీ
ఒకే దారంతో నేసిన
మట్టికుండల దరువు
శిరసెత్తుకుని వినిపించవా

6

ఊరి జ్ఞాపకాల్లోంచి
జ్ఞాపకాల మట్టి వాసనల్లోంచి
ఊరిని దాటి వచ్చాను
మట్టితో నిర్మించబడిన
ఊరిని దాటి వచ్చాను

రచనా కాలం : 28 డిసంబర్ 2017



# ఇన్నాళ్లూ గడిచి

ఇన్నాళ్లూ గడిచిన తర్వాత
జీవితం ఇంకా జీవిస్తున్నట్టే వుంది
పాతవాసన గుప్పుగుప్పుమని
పరిమళిస్తూనే వుంది
దుఃఖం జీర తడతడిగా తగులుతుంది
మరణించిన వాళ్లు జీవంతోనే
కళ్లముందు తిరుగుతున్నారు
వూళ్లో ఏది మారిందో ఏది మారలేదో
ఆ స్పర్శ తెలుస్తూనే వున్నా
తెలియాల్సిన రహస్యం రహస్యంగానే
మిగిలే వుంది
ఆనాటి రోజులు
విప్పారుతూనే వున్నాయి

ఇంటి ముందు కాలువలో
వదిలిన కాగితప్పడవ
అనుకున్న తీరానికి చేరిందో లేదో

చేరనీ చేరకపోనీ
కాగితప్పడవ ప్రయాణించిన దారి
దేహాంతరాలలో
మెలకువగానే వుంది

ఇంటిపైకెక్కి
ఆకాశంలోకి ఎగరేసిన గాలిపటం
ఏ మబ్బుల్లో చిక్కుకుందో
వుందో లేదో
గాలిపటం రాకకై ఇప్పటికీ
ఎదురుచూస్తూనే వున్నాను

ఒక వర్షం కురిసిన సాయంత్రం
ఏటిలో చేపలు పట్టి తెచ్చి
ఇంటివద్ద నూతిలో జారవిడిచిన క్షణాలు
చేతివేళ్లలోంచి
జారుతూనే వున్నాయి

ఇన్నాళ్లూ గడిచిన తర్వాత
ఇంటికెళ్లే తోవ
నిద్రలోనూ మరిచిపోలేదు
ఊరెళితే
కొండయ్యా అని పిలిచే
పిలుపూ వాడిపోలేదు

రచనా కాలం : 16 అక్టోబర్ 2017



# ఎండాకాలం

నది కళ్లల్లో నీరు లేదు
ఒడ్డుల కనురెప్పల్ని
నెమ్మదిగా తెరుస్తూ మూస్తూ వుంది
రాళ్ల కనుగుడ్లలోంచి
ఆకాశం వైపు ఆశగా చూస్తుంది
వెచ్చని గాలి నదిని గేలిచేస్తూ
పొగలు కక్కుతూ తిరుగుతుంది
నది కళ్లల్లో నీరు లేదు
ఎక్కడో ఏ మూలో ఏ చిన్న చెలమలోంచో
నానిన మట్టి వాసన
వూపిరి గదుల్నిండా అల్లుకుంటుంది
పొద్దున్ననగా
బక్కల్ని తోలుకెళ్లిన మట్టయ్య
కొండ నుంచి తిరిగొస్తూ
చెమట ఏరైన దేహంతో

ఇసుకలో
బతుకుచిత్రాలను గీస్తున్నాడు

ఈ రాత్రికి
వూరు కలలోకొస్తుంది

రచనా కాలం : 28 మార్చి 2017



# ఒక పిట్ట కథ

ఒక చిన్న పక్షి
ఇంటి కిటికీలోంచి లోనికి వచ్చి
అద్దం ముందు వాలింది
రెక్కల్ని రెప్పల్లా టపటపలాడిస్తూ
ఏవో వూసులు చెప్పింది
ముక్కుతో సుతారంగా ఈకలు సద్దుకుంది
తోకని పింఛంలా కదిపింది
అద్దం ఏమన్నదో
నవ్వింది
గుండెలెగిరిపడేలా నవ్వింది
ఏడ్చింది
గుండెలవిసేలా ఏడ్చింది
ఇల్లంతా చిన్నిరెక్కలతో కలియతిరిగి
మళ్లీ అద్దం ముందుకొచ్చి వాలింది
ఈసారి అద్దం
ప్రేమగా తలనిమిరింది
అద్దం లోపలికి పొదువుకుంది

కన్నీళ్లు తుడిచింది
అద్దంకి కూడా రెక్కలు మొలిచాయా
పక్షి ఆశ్చర్యపోయింది
ఒక్క క్షణంపాటు నిశ్శబ్దమైపోయింది
ఏ పురా జ్ఞాపకాలో చుట్టుముట్టి
అద్దంలోనే
అంతర్థానమైపోయింది

రచనా కాలం : 20 మార్చి 2018



# సూర్యుడు పొడిచే దిక్కు

నడక సాగుతుంది
ఎడారి పొద్దు మీద విరామంలేని నడక
రుతువులోంచి రుతువులోకి
రుతువుల వంతెన మీద
ఆగని తూలని నడక
నడక సాగుతుంది

నడక ఆగదు
అలసి అలసి దారే ముగిసిపోతుంది
రెండు శ్రమచేతులతో
రాత్రిపగలూ ఇంటిని అపురూపంగా అల్లి
మట్టి మీద
సజీవ సంతకంగా మిగిలిన జ్ఞాపకం

నిద్ర కరువైన రాత్రి
నిశ్శబ్దం సుళ్లు తిరుగుతుంది

అదే

తరతరాల వేకువజాము
చీకటి నల్లతాచు
వూరిని చుట్టుకుని
కుబుసం విడుస్తున్న వేళ
ఒకరి వెనుక ఒకరు
ఒకరి అడుగుల్లో ఒకరు
కనిపించని ముఖాలతో
నిరంతర ప్రయాణం

ఒక్కో గడియ
ఒక్కో శకలంగా ముగిసిపోతుంది

అడవి కళ్లు తెరుచుకుంది
చేయందించి లోపలికి లాక్కుంది
నిన్నటిలోంచి రేపటిలోకి
నడక సాగుతూనే వుంది
పాదాల చప్పుడు తప్ప యింకేం వినిపించట్లేదు
వెచ్చని గాలి, ఎండపొడ
నుదుటిని తాకి
జ్ఞాపకంలోకి సోలిపోతున్నాను
అదృశ్యస్వప్నం
చేయిపట్టుకుని ఏ తీరానికో నడిపిస్తుంది

ఆమె భుజాల మీద
సూర్యుడు పొడుస్తున్నాడు

రచనా కాలం : 23 నవంబర్ 2017



# తెగుతున్నవి రెక్కలేనా

రూపం మారుతుంది
నగరం పాతకుబుసాన్ని విడిచి
కొత్త కుబుసాన్ని తొడుక్కుంటుంది
గాలికి ఎండకి వానకి
తడిచిన నానిన ఎండిన పాతకుబుసం
ఎటో మాయమైపోతుంది
ఒక పెద్ద గ్రామం
నగరంగా విస్తరించింది
దశాబ్దాల తరబడి
రూపుగిద్దుకున్న రూపం కోల్పోయి
మరో కొత్త రూపంలోకి
ఒదిగిపోవడానికి
సిద్ధపడుతుంది
గాజు భరిణిలో
ఆభరణ స్థితికి
నగరం అలవాటుపడుతుంది

పచ్చని పంటపొలాల మధ్య
బతికి బతికి, బతుకు చితికి
నగరానికొచ్చాను
ఎటుచూసినా విస్తరిస్తున్న ఊడలతో
నగరం
ఒక పెద్ద మాయావృక్షంలా
కనిపించింది
భయం
కాలు కదిపితే
ఏ వూభిలో చిక్కిపోతానోనని
భయం
కళ్లు తిప్పితే
ఏ రాయో విసురుగా వచ్చి
నేల పడగొడుతుందేమోనని
భయం
భయం పాము
వెంబడించింది
కదల్లేదు

ఎక్కడ నిలబడితే
అక్కడే పాతుకుపోయా
ఒక్క అడుగు కూడా
చలించని దేహాన్ని మోస్తూ గడిపాను
నెమ్మదినెమ్మదిగా
నగరం అర్థమవసాగింది
అరచేతులను చాపి



ప్రేమతో దగ్గరకు పొదువుకుంది
నేనున్నానని
కన్నీళ్లు నిండిన కళ్లతో
దేహమంతా నిమిరింది
తొలిసారిజి
నగరం అరచేతుల్లో
నిర్భయంగా
నిద్రపోయాను

వేకువయ్యింది
అద్దె కొంప ముందు
సూర్యుడు
కిలకిలా నవ్వుతున్నాడు
తల్లి నవ్వింది
ఆమె నవ్వింది
పిల్లలు నవ్వారు
నవ్వు ముఖంతో
నగరంలోకి బయలుదేరాను

నగరం పనినిచ్చింది
అన్నం పెట్టింది
బతుకు రహస్యం చెప్పింది

వూరు విడిచి నగరంలోనే
సంవత్సరాలు గడిచిపోయాయి

మళ్లీ నగరం
ఒక పెద్ద మాయావృక్షంగా మారుతుంది
భయం చొరబడుతుంది
నిద్ర కరువౌతుంది
ఎక్కడ కాలువేస్తే
ఏ వూభి నోరు లాక్కుంటుందోనని
భయం
భయం పాము
దేహమంతా వ్యాపిస్తుంది
నగరం భయపెడుతుంది
భయాన్ని జయించడమూ
నగరమే నేర్పింది

రహదారికి ఒక ఓరగా
తట్టతో కూరగాయలమ్మే అంకమ్మ
సరే, ఏ వీధిలోకో వెళ్తుంది
నాలుగు చక్రాల బండిని
సత్తువదీరా లాగి
గోలిసోడా కొట్టే షేక్ మియా
సరే, ఎటో వొకవైపు వెళ్తాడు
పల్లెనుంచి నగరానికొచ్చి
మహానగరం ముఖద్వారంలోకి
ప్రవేశిస్తున్నాను
గడిని గడిని దాటి
నిచ్చెనలెక్కుతున్నాను
ప్రతిసారి పాము మింగి
కిందికి జారుతున్నాను



ఏ రోజూ
ఏ బెంగ బెదురూలేని కోట మాత్రం
ఏ భయం పామూ చొరబడని కోట మాత్రం
ఒక్క అంగుళమైనా
చెక్కుచెదరని కోట మాత్రం
ఠీవిగా దర్పంగా విలాసంగా
ఎందుకుందో కారణం ఒక్కటి మాత్రం
మరింత మరింత బాగా
అర్థమవుతుంది

రచనా కాలం : 25 సెప్టెంబర్ 2017

# పడవ పాట

వర్షం వర్షం
సముద్రమంతా కల్లోలం కల్లోలం
నీళ్లు నీళ్లు నీళ్లు నీళ్లు
ప్రళయం ప్రళయం
పడవ లేదు తెడ్డు లేదు వల లేదు
వలని తెడ్డుని విసిరే చేతులూ లేవు
ఏ నడి సముద్రానో
అస్తమించిన ఆకాశం
తీరంపైన గుడిసె నేత్రాల్లోంచి
ముక్కలు ముక్కలుగా రాలిపడుతూ
చందమామ
రెప్పల కింద కన్నీటి ఉపద్రవం
దోసిలి నిండదు
హృదయం చాలదు
ఇల్లంతా చిల్లుపడిన ఒకే దుఃఖపునావలో
తీరమూ వుందో లేదో
తెలియదు తెలియదు
వర్షం వర్షం



సముద్రం కన్నబిడ్డ
ఏ కెరటం మీదో తప్పిపోయాడు

నిద్ర లేదు, వేకువ రాదు

చీకటి చీకటి చీకటి చీకటి

ఒడ్డుకి కొట్టుకొనివచ్చిన పడవ
పాట పాడుతుంది

గాయపడిన సముద్రమా
గాయానికి లేపనం పూయవూ
రాలిపోయిన నక్షత్రమా
ఆచూకీ చెప్పవూ

రచనా కాలం : 21 అక్టోబర్ 2017

# తీరం బతుకు

వర్షం వచ్చీ వచ్చీ
సముద్రానికి సుడిగుండాన్నో తుఫాన్నో
బహుమతిగా ఇచ్చి
తీరం దాటిపోతుంది
వర్షానికేం
వస్తుంది పోతుంది
తీరమ్మీద బతుకుతున్నవాళ్లదే బెంగంత

ఆ తల్లి ఆ పిల్లాడు
రోజూ ఒక వాక్యాన్ని రాసి
తీరమ్మీద గిరాటువేసి
తెగిన ఏ వలల్లోనో
విరిగిన ఏ తెడ్డులోనో
అదృశ్యమైపోతారు
వెళ్తూ వెళ్తూ వదిలిన పాదముద్రలను
కెరటం వచ్చి లోపలికి లాక్కుపోతుంది



ఇల్లూ సముద్రమే
ఎప్పుడూ అల్లకల్లోలంగా వుంటుంది
కాలాలతో రుతువులతో
రాత్రీపగళ్లతో సంబంధం వుండదు

ఇంటి తీరం
హోరుహోరుగా దుఃఖిస్తుంటుంది
ఒకరి కన్నీటి చెమ్మను
ఇంకొకరు అద్దుకోకుండా
ఏ ఒక్కరూ ఏ రోజూ ముగించింది
లేదు

తీరమ్మీద బతుకు
ఆకాశానికి తెలీదు మేఘానికి తెలీదు

తీరంవైపు
మిణుకు మిణుకుమంటూ
వస్తోన్న పడవలోనే
వాళ్ల ప్రాణం
రెపరెపలాడుతుంది

ఒక ఉదయం మొదలుకావాలంటే
ఒక రాత్రి గడిచిపోవాలి

రచనా కాలం : 16 మార్చి 2018

# రహస్యమేదో

సముద్రంలోంచి
ఒక్క అల కదిలిన శబ్దమూ వినిపించదు
అలలపైన అదేపనిగా
ఎగురుతున్న
సుదూర పక్షుల వలసగానమూ వినిపించదు
అల వెంబటి అల
అల వెంబటి అల
అలలలలుగా
నిశ్శబ్దంగా తీరాన్ని తాకి
అంతే నిశ్శబ్దంగా వెనక్కి మరలిపోతాయి
ఏ ఇసుక రేణువూ
ఖాళీ నత్తగుల్లా
అలవచ్చిన ఆనవాలుని పొక్కదు
వేకువలోంచి చీకటిలోకి
వెలుతురు బింబం నడయాడుతుంది
నడిచివెళ్లిన దారీ మాట్లాడదు
చుట్టూ ఆవరించిన కొండల్లోంచి



ఎగిసే మేఘాల గుంపూ
వెనక్కి తిరిగి చూడదు

బోలుగా నిర్లిప్తంగా తీరం
తీరమ్మీద బొమ్మలేసుకుంటున్న ఓ చిత్రకారుడిలో
రహస్యం రహస్యంగానే
మిగిలిపోతుంది

రచనా కాలం : 18 అక్టోబర్ 2017

# కథలు చెప్పే అతను

పాటకి
రాళ్లు కరిగి నీరైపోయిన కథ చెప్పాడు
ముప్పై ఏళ్లుగా
ఏదో ఒక కథ
ఎవరికో ఒకరికి చెప్తూనే వున్నాడు
రాత్రి రెప్పవాల్చని కాలం వరకూ
పాదాల గడబిడ అడుగుల మధ్య
కుండపై దరువేస్తూ
ఏ గుండెలను కరిగించాలనో
ఆ నిశ్శబ్ద సంగీతలయకారుని ఆరాటం
ఏమో ఏ చైతన్యం వైపో

కదిపితే రాళ్ల కథేం
నిజంగా నీళ్ల కథే చెప్తాడు
నీళ్లు అగ్నిగా మారి అడవిని అల్లుకున్న కథ



అశ్రునయనాలతో ఆలపిస్తాడు
అగ్ని కథేం
విల్లు పుష్పంగా విచ్చుకున్న కథ
గొప్ప తమకంతో చెప్తాడు
అతను చెప్పాలి గాని
కుక్కపిల్ల కూడా చెవులు రిక్కించి
వింటుంది

చిన్న గోనె పట్టా
దానిపైనే కూర్చుని
చుట్టూ ఆవరించిన
చీకటి తునకలను చెదరగొడ్తూ
ఒక్కో పాటని
గాలి వీస్తున్నంత సహజంగా
నేర్పుగా
పాడుతాడు

రాతి కాలాన్ని
నిర్దయగా ఛీకట్టే
వొక్కడు

మనిషిని మనిషిని కలిపే
వొక రాగాన్ని అన్వేషిస్తూ భంగపడ్తూ

యిదే బతుకు అన్నాడు
చెట్టుని కొమ్మని పువ్వుని
మనుషుల్లోకి మళ్లించే
మహా కంకణమేదో కట్టుకున్నట్టున్నాడు

నావైపు తిరిగి ఒక దరువు వేశాడు

అతని దరువు
రాత్రి నిద్రలోనూ వినిపిస్తుంది

రచనా కాలం : 18 మార్చి 2018



# బుక్కెడు బువ్వ

కళ్లు
కాయలు కాసీ కాసీ
కదిలిపోతున్న నావలా వెళ్లిపోయింది
ఖాళీ నావ
సరుకూ సరంజామా గాని
ఒక్క మనిషి తోడుగాని లేని నావ
ఇంకో తీరమ్మీదికి వెళ్లిపోతుంది
తీరం మాట్లాడదు, ఓదార్చదు
గుండెల్లో పొదువుకుని
కన్నీళ్లభారాన్ని దించదు
పొద్దున్నేం తిన్నావని మాట వరసకైనా
పలకరించదు
పిల్లాపాపలు ఏడుంటారనైనా అడగదు
తెరచాపలేని నావ
ఏ తీరానికి కొట్టుకెళ్తే మాత్రం
ఎవరిక్కావాలి
నావ దుఃఖం నావదే

నావ బతుకు నావదే
నావని పిలిచి కాస్తా ప్రేమని అందించేవారే లేరు
నెత్తిమీద ఒట్టి సుంపాతతో
ఆ తీరమ్మీదికీ ఈ తీరమ్మీదికీ
సంచరించడమే గాని
ఏ తీరానికీ నావ కల్లోలం పట్టదు
తీరాలు మహా కఠినం

మళ్ళీ నావొచ్చింది, మళ్ళీ వెళ్ళిపోతుంది
నావ ఎవరిక్కావాలి
ఎన్నాళ్ళగానో అరిగి అరిగి మిగిలిపోయిన
నావ ఎవరిక్కావాలి
ఒట్టి పేద నావ
దులిపితే పైసా రాలని నావ
ఖాళీ కడుపు నావ
ఆకలిప్రేవుల నావ
బుక్కెడు బువ్వ కోసం
పొద్దూ రేయీ
తీరమ్మీంచి తీరమ్మీదికి
కొట్టుకువెళ్తున్న నావ

తీరాలకేం గాని
నావనే మాట్లాడమందాం
నావ లోపల రగిలే
తుఫాను హెచ్చరికను
ఆలకిద్దాం

రచనా కాలం : 19 అక్టోబర్ 2017



# రెక్కల కష్టంలోనే

ఒక్క
ఓదార్పు చినుకూ రాలదు
ఒక్క
చేయి సాయమూ మిగలదు
రెక్కల కష్టం మాత్రం
బతుకుని
వేయిన్నొక్క దృశ్యాలుగా
చిత్రిస్తుంది

ఒక్కో దృశ్యంలో
ఒక్కో చెమటబొట్టూ
మానవరూపానికి
నిలువెత్తు ప్రతిబింబమై
చరిత్రపుటల్లో
మిగిలిపోతుంది

కాలే
కడుపుల ఆకలి తీరదు

కరిగే
నెత్తుటిజీరలు చెరగవు

రెక్కలకష్టంలోనే
రాత్రి
రెక్కలు ముడుచుకుని
నిద్రపోతుంది
పగలు
రెక్కలు కూడదీసుకుని
నిద్రలేస్తుంది

ఒంటరి
బొందుమల్లెలు మాత్రం
రాత్రీపగలూ
శ్రమని కలగంటూ
నిద్రని
చెరిపేసుకుంటాయి

రచనా కాలం : 29 ఆగష్టు 2017



# ఏడుపొస్తుంది

ఏడుపొస్తుంది
ఏ వూళ్లోనో గింజలేరుకుని
మూటగట్టి ఇంటికితెచ్చి
పొయిమీదికి కుండెక్కించి
నోటినిండా అన్నం మెతుకులు
తిన్నాదో లేదో
ఒంటరి వూరవతల గుడిసెలో
మిణుకుమిణుకుమనే దీపంబుడ్డీ కాంతిలో
గుడిసంతా జీరాడుతున్న
నీడల నిప్పుల్లో నిప్పుల తలలో
మళ్లీ రేప్పొద్దుటికి
ఏ వూళ్లోనో గింజలేరుకోవడానికి
జోగుతూ జోగుతూ
నిద్రపంజరంలోకి జారిపోతుంది

ఏడుపొస్తుంది

రచనా కాలం : 12 అక్టోబర్ 2017

# తల్లి కళ్లు

గూట్లో
రెండు గుడ్లు పొదగబడి
రెండు పిల్లలయ్యాయి
రెక్కలు ఈడేరి
కాస్తా కాస్తా దూరం
ఎగరటం
మొదలుపెట్టాయి
ఇంకొన్ని రోజులకు
రెక్కలు ముదిరి
ఇల్లు దాటి దూరంగా
ప్రయాణించటం నేర్చాయి
ఎంత దూరం ఈదినా
గూటిని
మరిచిపోని రెక్కలు
సగం కూలిన ఇంటిని
భుజాలపైకెత్తుకున్నాయి



ఎదిగొచ్చిన
బిడ్డలరెక్కల్లోంచి
తల్లి కళ్లు నమ్మకంగా
చూస్తున్నాయి

రచనా కాలం : 9 అక్టోబర్ 2017

# ఉత్కళ భూమి

భాష తెలియని ప్రాంతంలో
ఆకలి భాష మాట్లాడుతుంది
నోరారా ఆకలి ఆకలి అంటుంది
భాష అర్థమైన వాళ్లు
ముఖం తిప్పుకుంటున్నారు
భాష అర్థంకానివాళ్లకూ
ఆకలి అర్థమవుతూనే వుంది

ముఖం కోల్పోయిన మనుషుల మధ్యే
ఆమె మెతుకు కోసం
వొక్క మెతుకు కోసం అల్లాడుతుంది

మెతుకు మీద ఆమెకు హక్కు లేదు
మెతుకును ఆమె ధిక్కరించనూ లేదు

ఆమె ముఖంలో
ఉత్కళభూమి తారాడుతుంది

రచనా కాలం : 24 మార్చి 2017



# ఆకలి నేలలో

చీకటి ఆవరించింది
ఆంధ్రా సరిహద్దు దాటాం
ఆకలి ప్రేవుల వాసన
గాలిలోంచి గుప్పుగుప్పుమని వస్తుంది
బాల్ గావ్
నేల మీద నిల్చున్నాం

కాల్చిన జొన్నకంకిని
చేత్తో పట్టుకుని నోటికందియ్యాలని
ఎవరిదో చేయి
తెగ ఆరాటపడుతుంది

ఒరిస్సా గ్రామంలో
ఆకలి పోయింది

రచనా కాలం : 24 మార్చి 2017

# వలస

ఒక పాడుబడ్డ
తలుపులు మూసివున్న
ఇంటిముందుకెళ్లి
తలుపుకొట్టాను

లోపల
ఎవరైనా వున్నారా, లేరు
లోనికెళ్లి చూశాను
నిజంగానే
ఎవరూ లేరు

ఎవరో ఎప్పుడో
పిల్లాపాపలతో బతికిన గుర్తులు
శిలాజాల్లా
ఇంటి మూల మూలా
మిగిలివున్నాయి



ఏ మూల నుంచో
పురాతన గొంతు వొకటి
వినిపిస్తుంది

బయటకొచ్చాను
బయట ఎవరైనా వున్నారా, లేరు
ఎవరూ లేరు

ఇంటి బయటా లోపలా
ఒట్టి నిశ్శబ్దం మాత్రం

వూడలు వూడలు దిగుతూ

రచనా కాలం : 29 జనవరి 2018

# అలలలలలుగా

1
ఒకానొక వేకువజాములో
చీకటి నల్లతాచు
వూరిని చుట్టుకుని
కుబుసం విడుస్తున్న వేళ
వీధిలోంచి
పాదాల చప్పుడు మాత్రమే వినిపించేది
ఒంటరి నిర్మానుష్యవీధిలోంచి
ఒట్టి
ఒట్టి పాదాల చప్పుడు మాత్రమే
వినిపించేది
అవిశ్రాంత పాదాల
అవిచ్ఛిన్న చప్పుళ్లల్లో
పగిలి బీటలువారిన నేల
లోలోన
మాట్లాడుతున్నటనిపించేది



2
బతుకు ఘోష

కెరటం విరిగి
కెరటంతో ఆలింగనమయ్యే
ఒక నిరంతర యాతన భాష
మట్టిరేణువుల్లోంచి
లోలోపల్లోంచి

3
నిద్రలేని రాతిగుహల్లో
వేకువతీవెలను ముద్దాడే కల
వేకువ దారిలో
కదిలే ముఖాల్లో
నీడలు నీడలుగా
ఇళ్లు, పిల్లలూ
ఇళ్లల్లో పిల్లల ఆకలిపొట్టల్లో
వినిపించే
వేలవేల పసిగీతాలు
రెక్కలు తెగి
నేలపై కొట్టుకుంటున్న
చిన్ని చిన్ని పిట్టలు

4
చీకటి పొరలు తొలగి
వెలుతురు ప్రసరిస్తున్న సమయం

సూర్యుడు ఎఱ్ఱగా
కాలిన ఇనుపగోళంలా
బతుకును వెతుక్కుంటూ
అడవిబాటలో నడిచే
చెమట భుజాలపై
మరింత గాఢంగా

5
అలలలలుగా సముద్రం పొంగినట్టు
అలలలలుగా స్త్రీలు

రచనా కాలం : 28 నవంబర్ 2017



# వేకువ దారిలో

నేను వెళ్తాను
ఈ చిత్తడి నేలలను అరణ్యాలను
వెనక్కి వదిలి
అడవి జనాలను వదిలి
అడవి మార్గాన్ని కూడా వదిలి
రక్తాన్ని చెమటని
ధారబోసిన
నా సొంత ప్రజల నుంచి
చాలా దూరం వెళ్తాను

హింసించబడి మరణించిన
మన పూర్వీకుల వారసులైన పిల్లల వద్దకు
రక్తహీనతతో బాధపడుతున్న
పిల్లల వద్దకు
నా అన్నదమ్ములు అక్కచెల్లెళ్ల వద్దకు
వెళ్తాను

నాలుగు నదులు
ఐదు స్థావరాలున్న ఈ నేలను
వెనక్కి వదిలేస్తున్నాను

నేను
స్వేచ్ఛదాహంతో వున్నాను
నా పడవలో ఒంటరిగా కూర్చుని
దూరంగా తీరంవైపు
కనిపించని నేలని వెతుక్కుంటూ
పడవని నడుపుతున్నాను

సరిహద్దు వద్ద
సెంట్రీ కాపలా లేదు

పడవ
తీరం నుంచి తీరంకు వెళ్లేటప్పుడు
స్వేచ్ఛాదాహంతో వున్న
మరికొంత మందిని
ఎక్కించుకుంటుంది

బెంగాలీ మూలం : Kalyani Thakur, Dalit Poet



# 2

***ఎర్రగా***
***వెచ్చని దమటలా రుతువు***

***నిండా***
***మనిషి పరిమళం వెదజల్లే***
***రుతువు***

***రుతువును***
***రెమ్మలు రెమ్మలుగా కత్తిరిస్తూ***
***కొన్ని చేతులు***

***కొత్త చిగురుని కలగంటూ***
***అదే రుతువు***

# గాయాల పాట

ఈ రాత్రిని పాడను
గాయాల రాత్రి, కన్నీళ్ల రాత్రి

ఎక్కడో
ఏ ఆదివాసీ గ్రామంలోనో
ఒక కల భగ్నమై
మట్టి అంతఃపొరల్లోంచి
విషాదం వాసన వేస్తున్న రాత్రి
ఈ రాత్రిని పాడను

ఎక్కడో తూరుపు  వేకువలో
ఒక పావురం రెక్క తెగిపడుతుంది
ఈశాన్యం నేలపై
ఒక నిరసన స్వరం త్రుంచివేయబడుతుంది
కశ్మీర్ లోయలో
ఒక ఆజాదీ దేహం తూట్లుతూట్లు పడుతుంది
ఈ రాత్రిని

ఈ విషాద గాయాల రాత్రిని
పాడను

ఎక్కడో
యూనివర్శిటీ ప్రాంగాణంలో
ఒక నెలవంక ఎర్రగా పుష్పిస్తుంది
సూర్యోదయానికి
వెలుతురు ఆచూకీ లేకుండా
పోతుంది
ఈ కన్నీళ్ల విషాద రాత్రిని
పాడను

ఏ ఊరి
చివరి గుడిసెలోంచో
ఒక వెలివేయబడిన స్త్రీ గొంతుక
మూగగా రోదిస్తుంది
ఏ వీధి
చీకటి మలుపులోంచో
ఒక నిర్భాగ్యుని మూలుగు
తెరలు తెరలుగా వినిపిస్తుంది
ఈ రాత్రిని
ఈ కన్నీళ్ల గాయాల రాత్రిని
పాడను

ఒక నాలుగు కాళ్ల
జంతువు ముందు



చేతులు కట్టుకుని నిల్చొని
నాపై శిరఃఖండనం అమలుజరపబడుతున్న
అనాగరిక స్వప్నాన్ని
వెలివేయబడిన ఆదిమకేకని
గాయపడిన పాటని

నేను పాడుతాను
హృదయంతోనూ, రక్తంతోనూ
పాడినంతవరకూ
ఊపిరి ఆగినంతవరకూ
పాడుతూనే పాడుతూనే
వుంటాను

రచనా కాలం : 17 మార్చి 2017

# నీళ్లలోని చేప

చేపల వేటగాడు
నీళ్లలోకి వల విసిరి
దొరికిన చేపలను చూసి
　　　　మురిసిపోయాడు
గాయాలతో చేపలు
　　　　విలవిలలాడుతుంటే
కళ్లవిందు చేసుకున్నాడు
మరణించిన చేపలపై
　　　　మాయా ప్రకటనలు చేస్తున్నాడు

వేటగాడు
వలలు విసురుతూనే వున్నాడు

నీళ్లు అనంతం
చేపలు నీటిచుక్కల్లో నీటిచుక్కలు

ఎప్పుడైనా ఎక్కడైనా
　ఏటికి ఎదురీదటమే
　　చేపలకు తెలుసు

రచనా కాలం : 30 అక్టోబర్ 2016



# తురాయి పూల దారిలో

నేలపై
ఒకానొక వాగ్దానాన్ని గుర్తుచేస్తూ
దారి పొడుగునా
ఎఱ్ఱని తురాయి పూలు
ఎటు చూసినా
ఆకుపచ్చని దేహఛాయతో
పత్రనేత్రాల చెట్లు
బాటకి ఇరువైపులా పహారా కాస్తూ
ఆలీవ్ గ్రీన్ రంగులో
కొండలు
✦
ఎక్కడో
ఏ యుద్ధభూమిలోంచో
ఒక సన్నని స్వరం
తెరలు తెరలుగా వినిపిస్తోంది
ఉక్కబోతల ప్రపంచంలో
జీవన సంక్షోభంలోంచి

ఒక పావురం
ఆకాశంలోకి రెక్కలు చాచుకుని
ఎగురుతుంది

రచనాకాలం : 6 జూన్ 2017



# మాయావృక్షం

మట్టిపొరల్లో దాక్కొని
లోకమంతా
విస్తారించాలనుకుంటుంది
కొమ్మలను
దేశమ్మీద నోళ్లలా చాస్తుంది
వేళ్లని
భూమి పొరల్లోకి లోలోపలికి
చొరబెడుతుంది

ఆకులతో
శాంతిమంత్రం జపిస్తూ
పూలతో
అభిషేకాల మంత్రోచ్ఛరణలు
చేస్తుంది
విత్తనాలను
దేశం నలుమూలలకూ
వ్యాపించాలనుకుంటుంది

సరిహద్దులపైన లోన
వికటాట్టహాసంతో నర్తిస్తుంది
సరిహద్దుల ఆవల
విషం గొంతును మోగిస్తుంది
కనిపించని హస్తాలతో
హంతకి పాత్రనెత్తి
నిష్ఠగా మౌనదీక్షలో
మునుగుతుంది

మట్టిపొరల్లో
కనిపించకుండా
దాక్కొని దాక్కొని
మహావృక్షంగా మారాలని
తపిస్తుంది

మట్టిని మోసం చేసే
ఎన్ని కుతంత్రాలు పన్నినా
చివరకు ఆ మట్టిపైనే
కూలిపోతుంది

రచనా కాలం : 10 అక్టోబర్ 2017



# అనగనగా ఒక ఆవు

అనగనగా ఒక ఆవు
వీధిలో నడుచుకుంటూ వెళ్తుంది
నుదుటిపైన పెద్ద బొట్టు వుంది
స్వేచ్ఛగా మహా ఠీవిగా
తోక వూపుకుంటూ నడుస్తుంది
వీధివీధిని నింపాదిగా చూస్తూ
నల్లని బలమైన కాలిగిట్టలతో
నేలపైన ముద్రలు వేస్తూ నడుస్తుంది
రథం కదులుతున్నట్టు ఆవు నడుస్తుంది
వీధిలోంచి ఇంటిగుమ్మాలవైపు మోరతిప్పి
దారి చూసుకుంటూ నడుస్తుంది
అలవాటైన వీధులే
అలవాటైన ఇళ్లే
అలవాటైన మనుషులే
ఒక్కొక్కటిని
పట్టి పట్టి కళ్లప్పగించి చూస్తుంది
దారిలో

జొన్నచేలు ఎదురైతే
జొన్న చేళ్లోకి దిగింది
అరటితోట కనిపిస్తే
అరటితోటలోకి నడిచింది
ఆవు మునిలా నడుస్తుంది

దేశ రాజధానిలోనూ
ఒక ఆవు నడుస్తుంది

దేశం మీదికొస్తుంది

ఈశాన్యం నుంచి వాయువ్యం వరకూ
హిమాలయాల నుంచి హిందూమహాసముద్రం వరకూ
ఆవు పాదముద్రలే వుండాలని
మదమెక్కినట్టు నడుస్తుంది

అనగనగా ఒక ఆవు

రచనా కాలం : 18 ఏప్రిల్ 2018



# మాత్రమే

ఈ రోజు కలలోకి ఆవు వచ్చింది
సావిట్లో రాటకి కట్టేసి వుంది
ఎండిన గడ్డి పరకలను మేస్తూ
దవడలను అటూ ఇటూ ఆడిస్తుంది
ఒంటిపైన ఈగలను తోకతో తోలుకుంటుంది
పక్కనే
కుడితిలో మూతి ముంచి
మోర పైకెత్తుతుంది
అంబా అంబా అని అరుస్తుంది
ఈ రోజు కలలోకి
ఆవు మాత్రమే వచ్చింది

రచనాకాలం : 15 అక్టోబర్ 2017

# ఇప్పుడు

ఇప్పుడు
పూలను కోద్దామన్నా
దుఃఖం ముంచుకొస్తుంది
పువ్వులాంటి
ఎనిమిదేళ్ల పిల్లని
చిదిమిన చేతుల్లో
ఎక్కడ
నా చెయ్యుందేమోనని భయం
నాకు చేతులున్నందుకు
తొలిసారిగా
సిగ్గుపడుతున్నాను
ఈ చేతులు
కాగితాలపై నాలుగు వాక్యాలను రాసి
రోజంతా మురిసిపోవటానికేనా
పూలను కోసి
చిన్నారి మృతదేహం మీద
నివాళిగా వేయటానికేనా



దుఃఖం ముంచుకొస్తుంది
చేతులుంటేనేం
లేకపోతేనేం

నేలరాలింది
మంచుబిందువులాంటి
తెల్లని ఆ పిల్లే కాదు
నేను కూడా
నెత్తుటి మడుగయ్యింది
గోళీలనేత్రాలున్న
ఆ లేతప్రాణం మాత్రమే కాదు
నేను కూడా

ఇన్నాళ్లూ
దేశం నా ముఖచిత్రమని
పొరపాటుపడ్డాను
ముఖంలేని దేశాన్ని
ఇంకెంతమాత్రం
అంగీకరించలేను

కాషాయం చేతుల్లో
నలిగిపోతున్న నా నేలపైన
నిటారుగా నిల్చొని చెప్తున్నాను
మళ్లీ గాయపడటానికి
సిద్ధంగా లేను

రచనా కాలం : 13 ఏప్రిల్ 2018

సూఫీల నగరం
బిగిసిన పిడికిళ్లలో తలెత్తుకుంటుంది

రచనా కాలం : 13 ఏప్రిల్ 2018

## రాలిన కుంకుమపూవు

కుంకుమపూల వనంలో
కాషాయ చీడ పట్టి
లేత కుంకుమపూవొకటి రాలిపోయింది
మూడురంగుల దేశంలో
త్యాగం రంగు అర్థం మారుతుంది
దేశం మనిషితనం
చనిపోయింది
తల నుంచి పాదాల వరకూ
ఒకే ఒక్క రంగు, ఒకే ఒక్క రంగు

చెమట మట్టి ప్రతీకైన జెండా ఒడిలో
మంచు కరిగి నెత్తురుగా పారుతుంది

కుంకుమపూల వనంలో
రాలిన లేత కుంకుమపూవు
దేశం మృతదేహం ముందు
ఎర్రని దీపశకలమై వెలుగుతుంది

# పసి పిల్లలు

ఎందుకో
ఈ ఉదయం పసిపిల్లలు గుర్తుకొస్తున్నారు
ఆసుపత్రి గదుల్లో
ఊపిరి ఆడక ఉక్కిరిబిక్కిరి అవుతూ
అమ్మ ఉమ్మనీటి సంచి కోసం
అల్లల్లాడే లేతపాదాల చిరు ఆకులే
కళ్ల ముందు కదలాడుతున్నాయి
వెళ్లిపోతాను మళ్లీ తల్లిగర్భంలోకి
కాసింత వెచ్చదనం కోసం
కాసింత వూపిరి కోసం
అలవికాని ప్రయాణాన్ని వెతుక్కుంటున్నాను
ఉక్కబోతని భరించలేకున్నాను
ఆ పసిపిల్లలు
నేలమీదికొస్తూ రెండు కన్నీటిబొట్లుగా
మిగిలిపోయారు
ఈ ఉదయమూ ఆ పసిపిల్లలే
గుర్తుకొస్తున్నారు



సామూహికంగా మరణించిన పసిపిల్లలు
సామూహిక దుఃఖంగా మిగిలిపోయిన పసిపిల్లలు

రచనా కాలం : 24 సెప్టెంబర్ 2017

## Wheel Chair Poem

నిర్మానుష్య
రాత్రి తొలివేకువలో
ఒక నిషేధిత గానం
తెరలు తెరలుగా
వినిపిస్తుంది

నీదో నాదో

దేశం చుట్టూ
మొలిచిన కంచెను
ఒక్క వూపిరిరెక్క
తెంపగలదు

నీదైనా నాదైనా

రాలిన
నెలవంకల గానం
నేల వేణువులోంచి



నిశ్శబ్దకెరటమై
తరగలు తరగలుగా
పోటెత్తుతుంది

నీలో నాలో

రచనా కాలం : 21 ఫిబ్రవరి 2018

# నిశ్శబ్దంగానో, నిర్మాణంగానో

ప్రశ్నని
కూల్చివేస్తున్న సందర్భంలో
బతుకుతున్నాం
✦
ఒక కొనని అందుకుని
            ఎగబాకుతున్నాను
తెగిన తీగెలను
            ముడివేస్తున్నాను
ఒక అవిచ్ఛిన్నరాగాన్ని ఎత్తుకుని
            అవిశ్రాంతంగా ప్రవహిస్తున్నాను
బతుకు చీకటి సొరంగంలోంచి
రెండు లేతకళ్లని బయటకు పెట్టి
భూమిని
తనివితీరా హత్తుకుంటున్నాను
వేలవేల కన్నుల్లో
ప్రతిబింబిస్తున్న నన్ను నేను



వేలవేలసార్లు
నిలబెట్టుకునే రహస్యాన్ని
            ఛేదిస్తున్నాను

నిశ్శబ్దంగానో, నిర్మాణంగానో
నా రక్తనాళాలను
నేను పేనుకోకపోతే
అంతే నిశ్శబ్దంగా
            అంతమైపోవాలి
ప్రశ్నగా
రూపొందాల్సిన సందర్భంలో
ఎక్కడో
ఏ చీకటి సొరంగంలోనో
            అదృశ్యమైపోవాలి

నిశ్శబ్దంగానైనా
నికార్సైన ఒక వాక్యాన్ని పేని
సమూహంలో నిలబెడతాను

బారులు తీరిన పాదాల్లోంచి
భూమి మొలకెత్తుతుంది

ఒక వాక్యం
            మరొక వాక్యం
                        ఇంకొక వాక్యం
వాక్యాల ధార, ప్రవాహం

భూమంత పద్యాన్ని అల్లి
భూమి ముందే నిలబెడతాను

✦

విత్తనం
మొలకెత్తుతున్న సందర్భంలో
బతుకుతున్నాం

రచనా కాలం : 27 సెప్టెంబర్ 2017



# తూత్తుకుడి

ఏమడిగాం
మా గాలి మాక్కావాలన్నాం
మా నీరు మాక్కావాలన్నాం
మా నేల మాకే కావాలన్నాం
మా నేలపైన
మా హక్కునే కోరుకున్నాం
ఏమడిగాం
మా బతుకు మాక్కావాలన్నాం
ఏం చేశావురా
తూటాలు కురిపించావు
ప్రాణాలు తీశావు
ప్రాణం మాకు లెక్కే కాదు
చెమట చిందించినట్టే
రక్తాన్నీ చిందిస్తాం
మాకు మా రక్తమెంతో
నీళ్లు అంత గాలి అంత
నేలా అంత

మేం
గాలి కోసం ప్రాణమిస్తాం
నీళ్ల కోసం ప్రాణమిస్తాం
నింగి కోసం ప్రాణమిస్తాం
భూమి కోసం బువ్వ కోసం బతుకు కోసం
ప్రాణమిస్తాం

మేం మరణిస్తాం మేం జీవిస్తాం

ఏమడిగాంరా
మా తూత్తుకుడినే కదరా
మేం అడిగాం

రచనా కాలం : 25 మే 2018



# పొలం యాత్ర

చెమటబొట్లు
బతుకు యాత్ర చేస్తున్నాయి
బొట్టు వెనుక బొట్టు
బొట్టు వెనుక బొట్టు
నేలదేహం చిందిన చెమటబొట్లు
గొలుసుకట్టుగా
ఒకే దారిలో నడుస్తున్నాయి
చెమటబొట్ల గొంతు
వినేదెవరు
లోలోన పొంగే కెరటం
ఏ హృదయాన్ని తాకుతుంది

చెమటబొట్ల యాత్ర
నిరాఘటంగా సాగిపోతుంది

చెమటబొట్లు
అదుపు తప్పలేదు

ఆవేశపడలేదు
గురి స్పష్టంగానే వుంది
గురివైపే నడుస్తున్నాయి
ఒక తీరం నుంచి
మరో తీరానికి
రోజుల తరబడి
ప్రయాణం చేస్తూనే వున్నాయి
రక్తం చిందిస్తున్నాయి
అలసిపోయినా ఆగిపోలేదు
వెనక్కి తిరిగి చూడలేదు
చెమటబొట్లు
ఆకాశంలో పొడిచే చుక్కలు
రాత్రుళ్లూ
రహదారులపై
సాగిపోతున్నాయి

ఇంటి వద్ద
వుయ్యాలలో పాప ఏడుస్తుందో
వీధిలోకి వెళ్లిన
పాప ఇంటికి చేరిందో లేదో
బెంగలేదు
ఆకలి యాత్రలోనే
పిల్లాపాప ముసలీముడగ

నడుస్తున్న దారిలో
ఎండలు ఆరి
నీడలు పూరుతున్నాయి



చెమటబొట్లు నగరం చేరాయి
నగరం చేతులు
పొడవుగా సాగుతూ
చెమటబొట్ల పాదాలను
తాకాయి

నగరం రుణం తీర్చుకుంది

పల్లె కౌగిలిలో నగరం
ప్రేమతో అల్లుకుపోయింది

పొలంయాత్ర
గెలుపు సాధించింది

రచనా కాలం : 17 ఏప్రిల్ 2018

# నల్లపూలు

ఒకానొక రోజు
నల్లపూలు సమ్మె చేశాయి
పూరి చివరి కొమ్మకు
వేలాడే నల్లపూలు
ఎప్పుడూ లేనిది ఈసారి
కాడల కాళ్లతో
          నిటారుగా నిల్చున్నాయి
కొమ్మని దాటి కిందికొస్తే
వాడిపోతాయనే భయంపోయి
సరాసరి పూరిలోకెళ్లి
ఘోరావ్ చేశాయి
తరాల దుఃఖాన్ని
          వీధి వీధిలో గొంతెత్తి పాడాయి
దుఃఖం లోపలి అగ్గి
          రాజుకుంది
మెత్తని రేకుల హృదయం
          లోగదుల్లోంచి



రాజుకున్న అగ్గి
          సెగలు సెగలుగా వ్యాపించింది

ఏ లక్షోసారో
దిగులుని దిగమింగుకుని
మరింక ఓపలేకపోయాయి
కొమ్మకు పట్టిన
వేలయేండ్ల చీడని ప్రశ్నించాయి
పూసే హక్కుని
బతికే హక్కుని
తుంచే హక్కు మీకెవరిచ్చారని
అడిగాయి
✦ ✦ ✦
తెలుసు
నల్లపూలకు ఏం జరుగుతుందో
తెలుసు
✦ ✦ ✦
పొంచివున్న తుపాకులు
నల్లపూలపై తూటాలని కురిపించి
నేల రాల్చాయి

రాలిన పూలల్లోంచి
రెమ్మలు గాల్లోకి ఎగురుతున్నాయి

రచనా కాలం : 7 ఏప్రిల్ 2018

# ఇంద్రావతి

ఈ రోజు
చందమామ
ఇంద్రావతిలోకి దూకి
ఆత్మహత్య
చేసుకుంది
ఆకుపచ్చని అరణ్యంలో
కొమ్మకొమ్మపై ఆకుఆకుపై
చల్లని లేత వెన్నెలని
కురిసే చందమామ
లోపలి కన్నీళ్లని
ఉగ్గబట్టలేకపోయింది
ఇంద్రావతి అలలపై
చందమామ ఆత్మహత్య చేసుకుంది

చందమామ
ఏ తీరానికి చేరుతుందో



ఆదివాసీల
ఆకలి తీర్చిన ఇంద్రావతి
ఆదివాసీల నెత్తురుతో
పురుడుపోసుకుంటున్న ఇంద్రావతి

రచనా కాలం : 26 ఏప్రిల్ 2018

# చంపావతి నుంచి

రోజూ
ఈ నదిని దాటి వెళ్తున్నాను
ఈ రోజెందుకో
నదిని దాటాలనిపించట్లేదు
లోపల
దుఃఖం దుఃఖంగా వుంది
హృదయం పగిలి
నెత్తురుకారుతున్న దుఃఖం
నెత్తుటినాళాలన్నీ పిగిలి
ఒళ్లంతా నెత్తుటిమయమైపోతున్న దుఃఖం
గాయపడిన హృదయం
ఎన్నిసార్లు కూలిందో
మృతశరీరంలా వుంది నది
రక్తంలా నీళ్లు
చంపావతి నది పొగిలి పొగిలి ఏడుస్తుంది
నిద్రలేని కళ్లతో
రాత్రంతా ఏ వూళ్లో ఏ కథ పాడిందో



నెత్తుటి కథ
ఆకలి కథ
నదులు మృతదేహాల ప్రవాహాలౌతున్న కథ
నీళ్లు పారాల్సిన నదుల్లో
నెత్తురేమిటి
నెత్తురు పారాల్సిన దేహంలో
కన్నీళ్లేమిటి

చంపావతి నది
వూళ్లను వూళ్లను అల్లుకుంటూ
ఒరిగిపోతున్నది

నదులెండిపోతున్న కథ పూర్తవకముందే
మరో కొత్త కథకి రంగం సిద్ధంచేయబడింది

చంపావతి నది
దుఃఖం గుంతలో కూరిపోతున్నది

చంపావతిలో నీళ్లేవి
పంటపొలాల్లో వున్నమేది

ఆకలితో వలసెళ్లిపోతున్న వూళ్లల్లో మనుషులేరి

పిడచకట్టిన నది దేహం
కన్నీళ్లతో నిండిపోయింది

చంపావతి నదిలో
దుఃఖం సుళ్లు తిరుగుతుంది

నదిని దాటి వెళ్తున్నాను

చంపావతి నది నుంచి
కన్నీటి కథలను ఏరి
పూళ్ల మీదుగానే నడుస్తున్నాను

రచనా కాలం : 27 ఏప్రిల్ 2018



# నజీబ్ తల్లి

చిప్పిల్లిన కన్నీళ్ల సాక్షిగా
ఆ తల్లి బతికే వుంది
ఆచూకీలేని కుమారుడు
ఏ చెరలో వున్నాడో
బతికున్నాడో లేదో

అపురూపంగా నోటికింత అన్నం ముద్దనందించే దృశ్యం
ఏ అదృశ్య అగాథాల పెనుసంద్రాల వెనుకో అస్తమిస్తుంది

అలసి ఇంటికొచ్చిన వేళ
ముఖాన్ని ఆత్రంగా తీసుకోవడానికి ఏం మిగిలాయి

యిన్ని కన్నీళ్లు
యింత దుఃఖం

ఆశ వొక్కటే చెదిరిపోకుండా మిగిలి వుంది

అల్లుకుంటున్న చేతులు సాక్షిగా
ఆ తల్లి బతికే వుంది

ఇంకా నిద్రపోతున్న దేశాన్ని
కొరడాతో చెల్లుచెల్లుమనిపిస్తోంది

రచనా కాలం : 12 నవంబర్ 2016



# ఏం మారలేదు

శీతల గదులలో
తెల్లని దూదిపరుపుపై
బోర విరుస్తూ రూపాయి

చెమటల ఉక్కపోతల్లో
నడిరోడ్డుపై
బోర్లాపడుతూ రూపాయి

ఒకటి దేహానిది
రెండు దేశానిది

రచనా కాలం : 15 నవంబర్ 2016

# రెండు విగ్రహాలు

అదొక కూడలి
పక్కపక్కనే రెండు విగ్రహాలు
ఒకటో విగ్రహం మరణించి
దశాబ్దం కూడా కాలేదు
రెండో విగ్రహం మరణించి
ఆరు దశాబ్దాల పైమాటే అయ్యింది
కొన్నేళ్లుగా
ఒక దగ్గరే కలిసి నిల్చున్న చొరవతో
ఒకటో విగ్రహం
రెండో విగ్రహంతో అంది
నేను రైతన్నలకు అన్నం పెట్టాను
నేను భూమిలేనివాళ్లకు భూమినిచ్చాను
నేను పేదోళ్లింటిలో దీపం అయ్యాను

రెండో విగ్రహం విన్నది
కాని ఏం మాట్లాడలేదు



కొన్ని రోజులు పోయినతర్వాత
ఒక రైతు అటువైపు వెళ్తూ
ఆ విగ్రహాల వద్దే పురుగుల మందు తాగి
ఆత్మహత్య చేసుకున్నాడు

పెద్ద ఊరేగింపు మొదలయ్యింది
ఇంటింటికి పాదయాత్ర మొదలుపెట్టారు
ఒకటో విగ్రహాన్ని పూలదండలతో అలంకరించారు
కొత్తగా వేసిన రంగులతో
ఆ విగ్రహం
మరింత తేజస్సుని మరింత కాంతిని
పొందింది

రెండో విగ్రహం తల ఊడిపడి
చూపుడు వేని మాత్రం
ఆకాశం వైపు చూస్తుంది

రచనా కాలం : 18 మార్చి 2017

# అక్టోబర్ 2

గాంధీగారు
నిర్లిప్తంగా కూర్చున్నారు
సుదీర్ఘ ఆలోచనలో వున్నట్టున్నారు
అతని ముందు నుంచి
పాదచారులు
అటూ ఇటూ ఇటూ అటూ
నడుస్తున్నారు
ఎవరూ పెద్దగా పట్టించుకున్నట్టు లేదు
గాంధీగారు ఏమాలోచిస్తున్నారో
ఎవరికీ ఏమంత
అవసరం లేనట్టే
అందరూ వున్నారు

బతికున్నప్పుడు
చూపుడు వేని తూరుపుదిక్కై
నిలవని గాంధీగారు
యిప్పుడెలా మిగిలుంటారూ



అన్నట్టు
ఒకామె గాంధీగారి వైపు
ఒకసారి చూసి
ముందుకు కదిలిపోయింది

గాంధీగారి వద్దకి
ఎవరైనా వెళ్లి
గాడ్సే దేవుడు గురించి చెప్తారా
ఎవరో చింపిరి గడ్డమాయన
లోలోన అక్కడే
గొణుక్కుంటున్నాడు

అయినా
ఎవరైనా పిలిస్తే
లేచి నిల్చొని
ఒక అడుగు ముందుకు వేయటానికి
గాంధీగారు విగ్రహంలో
బంధించబడ్డారు

ఎక్కడనుంచో ఎగురుకుంటూ వచ్చి
ఒక కాకి గాంధీగారి తలపైన వాలింది

రచనా కాలం : 2 అక్టోబర్ 2017

# ఒక నెత్తుటి భరోసా తర్వాత

సముద్రంతో
సమాంతరంగా ప్రయాణం చేస్తున్న సందర్భం
సూర్యుడు
పడమటితల్లి ఒడిలోకి
ప్రశాంతంగా దిగుతున్నాడు
గాలి
రివ్వురివ్వున కొడుతుంది
అక్కడొకరు ఇక్కడొకరు
జ్ఞాపకాలను వెతుక్కుంటున్నట్టు
నడుస్తున్నారు
విస్తరించిన సరుగుడు చెట్లలోంచి
ఒక పరిమళం ఏదో ప్రసరిస్తుంది
వేలవేల నిముషాల ఉక్కబోతల్లోంచి
తెరిపినిస్తూ ఒక పాట
ఏ వీధిలోంచో వినిపిస్తుంది
నెత్తుటి జ్వాలలాంటిదేదో
శరీరాన్ని మైమరిపింపజేస్తుంది



ఒక వూరు
ఒక పోరాటాన్ని ప్రసవించిన వూరు
ఒక నమ్మకం ఒక భరోసా
ఇంకా మిగిలేవున్నాయని తేటపరిచిన వూరు
వూరు ముందు నిల్చొని
దేహీ అన్నాం
వూపిరిజోలె నిండా
వూరే నిండిపోయింది

*సోంపేట మీదుగా ప్రయాణం చేస్తూ..*

రచనా కాలం : 24 మార్చి 2017

# నది చెప్పిన కథ

రాత్రి
నిద్రలో ఒక కల వచ్చింది
వేకువ జాము చీకట్లో
నదిలోకి
పడవేసుకుని వెళ్లాను

నీళ్లల్లో చేపల రెప్పల కింద
భూమి నిద్రపోతున్న నిశ్శబ్దం
గూళ్లల్లో పిట్టల రెక్కల కింద
ఆకాశం నిద్రపోతున్న నిశ్శబ్దం

నది ఒక కథ చెప్పింది

అనగనగా ఒక ఊరు
ఊరునానుకుని ఏరు
ఏటి ఒడ్డున చెట్టు
చెట్టు కొమ్మకొమ్మపై పక్షులు



ఎక్కడెక్కడి నుంచో
ఏఏ వూళ్ల నుంచో
వచ్చి వాలాయి

పక్షుల ఆకలి తీర్చిన చెట్టు
వూపిరి పీల్చటానికి కాస్తా దన్నునిచ్చిన చెట్టు

మూడు పూటలా
రెండు రెక్కలతో
చెమట కారుస్తూ
పక్షులు పనిచేశాయి

ఒక రోజు
చెట్టు చుట్టూ కంచెను బిగించారు
పక్షులు ఆకలితో అలమటించాయి
అలమటించిన పక్షుల్లో
తెగింపు పుట్టింది

పక్షులు సమ్మె చేశాయి

చెట్టు చుట్టూ
కంచె వేసిన వేటగాడు
నిర్ధాక్షిణ్యంగా
పక్షులను గురిచూసి
నేలకూల్చాడు

రక్తం, నేలంతా రక్తం

కథ చెప్తున్న నది వొణికిపోతున్నది

కథని కొనసాగించింది నది

నేలకూలిన పక్షులను చూసి
మిగిలిన పక్షులు నిరాశపడలేదు
రెక్కలు బిగించాయి
నిటారుగా నిల్చున్నాయి

నిరసన యాత్ర
ఆకలి యాత్ర
పోరాట యాత్ర చేశాయి

చెట్టు చుట్టూ
కంచె తొలగింది
పక్షుల అమరత్వంతో
నోటికి మళ్లీ బువ్వ అందింది

నది కథ చెప్పి
మౌనంగా వుంది

ఎన్ని కథలున్నాయో నదిలో
ఎన్ని కన్నీళ్లున్నాయో నదిలో

మరో కథనో వెతనో నెమరేసుకుంటూ
ఇంకా మౌనంలోనే వుంది నది

రచనా కాలం : 2 జనవరి 2017



# నదిని దాటుతూ

ఎన్నిసార్లు
నదిని దాటానో
దాటిన ప్రతిసారి
నది కనుగుడ్లపై
కన్నీటిచారికలను
చూశాను

నది మాట్లాడలేదు

ఎన్నిసార్లు
తీరం మీద నడిచానో
నడిచిన ప్రతిసారి
తీరంపైన
రాకాసి పాదముద్రలను
చూశాను

తీరం మాట్లాడలేదు

ఎన్నిసార్లు
నీళ్లల్లో వూరి ప్రతిబింబాన్ని వెతికానో
వెతికిన ప్రతిసారి
వలసెల్లిన వూరుని
అడుగునెక్కడో తేలిన రాళ్లల్లో
చూశాను

నీళ్లు మాట్లాడలేదు

నేనిప్పుడు
నది గొంతునయ్యాను

రచనా కాలం : 8 జనవరి 2018



# ఒక గతంలో ఒక వర్తమానంలో

ఏరు
ఎక్కడో కొండల్లో పుట్టి
గల గల గల గల
నీటి మాటలతో
వూరుని నిద్రలేపి
వూరి దోసిలిలోకి
సూర్యోదయాన్ని వొంపుతుంది

వూరు
ఆ పక్క ఈ పక్క కొండలతో
నాగలి బొరుగు వదిలి
నారమిల్లు గోడ ఆసరాగా
ఎగబాకే
సన్నని తీగెమొక్కలను
ఒళ్లోనేసుకుని
బతుక్కింత ఆసరా అవుతుంది

మిల్లు
ఆకలికేకల నినాదాలతో
ఉదయం సాయంత్రం
చీమలబారుగా సాగే
జనం చేతుల్లో
ఏరోజుకారోజు
ప్రాణం పోసుకుంటుంది

ఏరు మిల్లు వూరు
ఒక గతంలో ఒక వర్తమానంలో

రచనా కాలం : 29 జనవరి 2018



# తీరానికి

ఈ రాత్రి
నెలవంక ఓ పడవ
మేఘావృత ఆకాశంలోకి
ఆకాశం హృదయంలోకి
ఈదుకుంటూ వెళ్తుంది
ఇళ్లులేని కలలులేని
పాదరక్షలులేని నిద్రలేని
గాయపడినవాళ్లూ ఆకలితో దుఃఖించేవాళ్లూ
పారిపోయినవాళ్లూ ఖైదులూ
శ్రామికులూ పోరాటకారులూ
ప్రేమికులూ స్థానికేతరులూ
ఉద్యోగస్తులూ
వాళ్లంతా ఏమీలేని శూన్యం గుండా
తరలించబడుతున్నారు

ఎక్కడైతే
విమానాలు ఎగరవో

ఎక్కడైతే
క్షిపణలు చేరుకోవో
ఎక్కడైతే
పక్షులకు రెక్కలు అవసరం లేదో
వర్షంపడదో
ఎక్కడైతే
భూమి గురుత్వాకర్షణశక్తిని
కోల్పోతుందో
అక్కడికి
అమరత్వం ప్రవహించే చోటుకి
యివన్నీ
నెలవంక పడవ ద్వారా
తరలించబడతాయి

మనం ఈదుతున్నాం
దట్టమైన ధూళితో నింపబడిన
సముద్రం గుండా
ఏ చోటుకి చేరాలో తెలియని స్థితి
ఈ ప్రయాణం
మన స్వస్థలానికి
కదలకుండా వుండు
పాట పాడు
పడవ నడిపే స్త్రీ చెబుతున్నది
రాత్రి సుదీర్ఘమైనది

కశ్మీరీ మూలం : Uzma falak



# Poem

నిరాశని రానివ్వొద్దు
నిన్ను పక్కకి మళ్లిస్తుంది
రాయటం మాత్రం మరిచిపోవద్దు
ఒట్టి రాళ్లతోనే కాదు
కాగితాల మీదా రాయాలి
చెట్ల ఆకుల మీదా రాయాలి
రక్తమయమైన రహదారుల మీదా రాయాలి
గుర్తుంచుకో
మన ప్రియమైన పదం
ఆజాదీ

నెత్తురోడుతున్న హృదయంతో
నేను రాస్తున్నాను

కశ్మీరీ మూలం : Inshah malik

# 3

ఎవరూలేని
ఒంటరి దుఃఖాన్ని ద్వేషిస్తాను
లోలోన రగిలే అగ్నికుంపటిని
నెత్తి మీద నుంచి
భళ్లున కిందికి పగులగొడతాను
కాల్చుకుతింటున్న దుఃఖం
పరమ మోహపూరిత దుఃఖాన్ని
పెంకులు పెంకులుగా
విరగగొట్టకపోతే నిద్రలేదు

నా రాతి పిడికిల్లోంచి
దుఃఖం చిగురిస్తుంటుంది
నేను దుఃఖాన్ని స్రవిస్తాను
దుఃఖం నన్ను స్రవిస్తుంది

దుఃఖం కంచెల మధ్య నేను పునర్జీవిస్తాను

# ఏ కెరటం చెరిపేయని

ఏ కెరటం చెరిపేయని
కొన్ని పాదముద్రలను విడిచిపెట్టాను
నేల పరిమళంతో
నిండా ప్రేమలో మునిగివున్నాను
వూరి కళ్లల్లోంచి
యుగాలుగా సూర్యోదయసూర్యాస్తమయాలను
చూస్తున్నట్టే అనిపిస్తుంది
వూరు నా ఆనందం
వూరు నా దిగులు
ఈ వూరి మట్టిలో నా వేళ్లు పాతుకుపోయి
చేతుల కొమ్మలతో
లోకంలోకి విస్తరిస్తున్నాను
నిన్నో మొన్నో
పరిచయమైన స్వల్పకాల అనుబంధమసలే కాదు
రాత్రి లేదు పగలు లేదు
ఒకే ఒక్క ఆరాటం
హృదయప్పొరల్లోంచి వినిపించే నిశ్శబ్దగానం

పూరి ఒడిలో ఓలలాడాలానే
నిరంతర దుఃఖప్రవాహం

ఈ పూరిలో ఏ తీగె పెనవేసుకుందో
విదిలిస్తే వదిలిపోయేది కాదు

రచనా కాలం : 10 ఆగష్టు 2017



# Mourning of heart

ఏం లేదు
నిశ్శబ్దగానమే మిగులుతుంది
తడితడి కళ్లల్లోంచి
దుమికే జలపాతాల హొరు
ఏ కఠిన పొరలకిందో ఇంకిపోయింది
దేహం నలుమూలల్లోంచి
ఎగిసే ఉద్విగ్నకెరటాల ఉనికీ
ఎక్కడో ఏ మూలో
అదృశ్యమైపోయింది
నిన్నే కడసారిగా వినిపించిన
వేలవేల అగ్నిపర్వతాల ప్రేలుళ్లూ
వినిపించట్లేదు

ఏ దిశలోంచో
వీచే సన్నని గాలిస్పర్శకే
మైమరిచిపోయాను
అటువేపు తలతిప్పితే
ఇటువేపు నోరారా పిలిచే దగ్గరితనం

ఎటువేపో కదలిపోయింది

ఒంటరిబావిలో ఈదులాడుతున్నాను

దారిలో పెదాలపైన నవ్వుతో
ఎవరో ఒకరు
చేయి పట్టుకుని కొంతదూరం నడిపిస్తారు
కాస్తా ఓదార్పునిచ్చే
నవ్వు మాత్రమేనని
ఇరువురికీ తెలుస్తూనే వుంటుంది

చీకట్లో నడుస్తాం
ముఖాల్లో దుఃఖాన్ని పసిగట్టే
చీకట్లో ప్రయాణిస్తాం
ఒకరి తడి ఒకరికి అంటుతుంది
ఒకరి స్పర్శ ఒకరికి హాయినిస్తుంది
ఎడారిలో ఎగిరే గువ్వ
ఎక్కడో ఒక దగ్గర రాలిపోతుంది
ఒట్టి రెక్కలతోనే ఈదులాడాలి
అలసిపోయిన వరకూ
అలసి ఆగిపోయిన వరకూ
నిరంతర యానం చేయాలి

తోడుగా నిశ్శబ్దగానం మాత్రమే వుంది

రచనా కాలం : 29 ఆగష్టు 2017



# తెరిపి / ముసురు

చాన్నాళ్ల తర్వాత
ఒక వెలుతురు కిరణం ప్రసరిస్తుంది
గడ్డకట్టిన ఒకానొక మంచుపెళ్ల
ఒక్కొక్క బొట్టుగా కరుగుతుంది
కనుగుడ్ల వెనుక
నెత్తురు కారుస్తున్న ఒక్కొక్క జ్ఞాపకం
ఒక్కొక్క దుఃఖశకలంగా మిగిలి
ఆపాటికే చిన్న మెరుపుతునకై
మబ్బులు తొలగే సాయంత్రాల్లో
చేలల్లోంచి వీచే లేతగాలిలా
ఉప్పుతేరిన చెంపలతీరాన్ని తాకుతుంది
చీకటి పడుతూనే చీకటి పడుతూనే
ఇంటి నుంచి పిలుపు వస్తుంది
ముక్కలు ముక్కలైన హృదయం
ఎప్పటికీ అతుక్కోదు

తెరిపి ఇస్తున్నట్టే ఇస్తూ
ముసురు కమ్ముకుంటుంది

రచనా కాలం : 5 ఆగష్టు 2017

# Struggle of pain

రోజూ
కాస్తొ దుఃఖం, కాస్తొ కన్నీరు
హృదయప్పొరల్లోంచి
కాస్తొ కాస్తొ
ఉబికి వస్తుంటాయి
కాసిన్ని అనుభూతులూ
కాసిన్ని మమతలూ

ఏ అర్ధరాత్రో
నిద్రలోంచి అకస్మాత్తుగా
లేచి కూచుంటాను
నా చుట్టూ అప్పటికే
జ్ఞాపకాలు నిద్రలేచి కూచుంటాయి
ఒకరి ముఖంలోకి ఒకరం
ముఖం పెట్టి యాతన పడతాం
బిగిసిన చేతివేళ్ల సంకెలలోంచి
దారిని వెతుక్కుంటూ
ఆ దారిలోనే ముగిసిపోతాం



నేనూ నా జ్ఞాపకాలూ
నెమ్మది నెమ్మదిగా
మార్మిక లోయల్లోకి జారిపోతాం

గాయపడిన
పగళ్లలో తిరిగి తిరిగి
రాత్రుల్లలో
కలవరిస్తుంటాను

గాయం ఎంత మృదువో, అంత కఠినం

రచనా కాలం : 5 ఆగష్టు 2017

# నిశ్శబ్దం ఊయలలో

ఊరటనిచ్చే
ఒకే ఒక్క పదం కోసం
పడిగాపులు కాస్తున్నాను
తెగిన తీవెలను
అతికించే పనిలో వున్నాను
ఒక్క పదం పూవు రాలి
నేలను పరిమళభరితం చేస్తుందన్న ఆశతో
నిశ్శబ్దాన్ని మోస్తున్నాను
శబ్దమయ ప్రపంచంలో
నిశ్శబ్దానికి జోలపాడుతున్నాను
నిశ్శబ్దం
నా దేహం వూయలలో
వూయలలూగుతుంది

రచనా కాలం : 7 సెప్టెంబర్ 2017



# కాస్తా దూరంలోనే

నువ్వూ నేనూ
పిలిస్తే పలికేంత కాస్తా దూరంలోనే
నువ్వక్కడ ఏ జ్ఞాపకాన్నో
అక్షరాల్లోకి అనువదిస్తూ వుంటావు
నేనిక్కడ ఏ ఒంటరి క్షణాన్నో
క్షణక్షణం కలవరిస్తూ వుంటాను
ఒక్కసారిగా
పాతవైభవాన్ని ఇద్దరం పంచుకోవాలని
తెగ తాపత్రయపడతాం
ఏం మిగల్లేదు
సాయంకాలం దిగులు
ఇద్దరిలోనూ పరుచుకుని వుంది
ఒక మాటో ఒక పిలుపో
ఈ కొస నుంచి వినిపిస్తూ
నిశ్శబ్దాన్ని మాయం చేస్తుందనుకుంటాం
భ్రమని నిజమని నమ్మడం
అలవాటైపోయింది

నువ్వూ నేనూ
కలుస్తామనే నమ్మకం వుంది
నమ్మకం వెనుక
ఒక గాఢ ఆలింగనం వుంది

రచనా కాలం : 9 ఆగష్టు 2017



# కాంతి

ఇవాళ
కిటికీ కనురెప్పల్లోంచి
గదినేత్రాల్లోకి
కాంతి ప్రసరిస్తుంది
రెండు రోజులుగా ఆవరించిన ముసురు
ఒక్క కాంతిపుంజం రాకతో
ఎటో
రెక్కలు కట్టుకుని ఎగిరిపోతుంది
నిన్నటి నుంచి
పొరలుపొరలుగా వ్యాపించిన దిగులు
కన్నుల్లో వూరే
కాసింత చెమ్మగా మిగిలిపోతుంది
ఒక అస్పష్టచూపులోంచి
ఏదో మహత్తు జరగబోతున్నట్టు
లీలగా
అనిపిస్తుంది

రచనా కాలం : 10 జూలై 2017

# పునరుత్థానం

పునరుత్థానం చెందడమే
తిరిగి తిరిగి లేవడమే
దూరమైన స్వప్నాన్ని దరికి వెళ్లి
ఒడి చేర్చుకోవడమే
వెంటాడే దిగులును
రాత్రీపగలూ ఆనందంగా మోయడమే
బరువునూ
బాధ్యతగా ఆస్వాదించడమే
కళ్లల్లో సముద్రాన్ని చూసి
ఉప్పొంగి ఊరటచెందడమే
నిద్రలోనూ మెలకువలోనూ
మొలకెత్తుతున్న అక్షరాలతో
కాసిన్ని క్షణాలు సేదదీరి
ఒక దృఢవాక్యంగా నిలబడడమే

ఊపిరి ఊపిరి నిండా
నేల పరిమళమే అల్లుకుంది

రచనా కాలం : 2 ఆగష్టు 2017



# నాన్నొచ్చే సందర్భం

ఎక్కడో
దూరంగా కొండల్లోంచి
ఏ అర్థరాత్రో ఏ తెల్లారగట్టో
నాన్న వూళ్లోకి దిగేవాడు

భుజానికి సంచి
సంచిలో పుస్తకాలు
కళ్ల నిండా శూన్యంతో
ఏవేవో కలలతో
దిగుళ్లతో కన్నీళ్లతో

ఏ ఆదిమ చిత్రకారుడో
గుహ నుంచి గుహలోకి సంచరిస్తూ
ఇంకేం లేనట్టు
కుడ్యాలపై బొమ్మలను ముద్రించటమే
వూపిరిగా బతికినట్టు
నాన్నా అంతే

బొమ్మల వ్యసనపరుడు
ఎప్పుడొచ్చినా
అనేక రంగుల కలబోతగా కనిపిస్తూ
ఒక్కో రంగులో
అంతర్థానమైపోతూ

నాన్న ఎప్పట్లానే
ఇంటిలోకి అడుగుపెట్టేవాడు
నెలంతా కనిపించని నాన్న
ఏదో విషాదం రంగుని పులుముకుని
అమ్మకి దొరక్కుండా

నాన్నలూ కల్లోలసముద్రాలే
లోపల కెరటాల్తో విరిగిపడతారు
దుఃఖం సుడిగుండంలో
పూడికపోతారు

నాన్నలు తెలీరు గాని
ఏ విషాదమూ మోయకుండా
ఏ నాన్నా వుండరు

రచనా కాలం : 31 మార్చి 2018



# కన్నీటి దారిలో

నావ వెళ్లిపోయింది
ఒడ్డు ఒంటరిగా మిగిలిపోయింది
నిశ్శబ్ద సముద్రంలో
అలల పసిరెక్కలను నిమురుతూ
నావ కదిలిపోయింది
ఆకాశం అన్నీ చూస్తూనే వుంది
నీరు గుండె బిగబట్టి
నావకు దారి ఇస్తుంది
బతుకు సముద్రంలో
అనేకానేక దారుల్లో ప్రయాణించిన నావ
కడసారి ప్రయాణంలో
కన్నీటి దారిలో కదిలిపోతుంది

ఒడ్డు నిలువెల్లా నీరైపోతూ
మళ్లీ మళ్లీ చూసిన దృశ్యాన్నే చూస్తుంది

రచనా కాలం : 24 జూన్ 2017

# ముసురు

ముసురు పట్టింది
పగలే చీకటి కురుస్తుంది

నేలపై
మంత్రించిన పిడికెడు అక్షరాలను వెదజల్లి
ఒక యాత్రికుడు
మౌనంగా కదిలిపోతున్న దృశ్యం
పదే పదే
కళ్లముందు నిలుస్తుంది

నింగిని నేలని ఏకం చేసే నీటిధార
ముసురులో ఒణికిపోతున్నాను

ఒకానొక సాయంత్రంలో
రెండుశిఖరాల మధ్య నీళ్ల వంతెనపై
సూర్యుడు
దిగంతాల్లోకి అదృశ్యమైపోతుంటాడు



ఆకాశం
పాలిపోయిన రంగులోకి
మారిపోతుంది

ముసురు నెమ్మదినెమ్మదిగా వ్యాపిస్తుంటుంది
దేహం నుంచి దేహంలోకి సరసరా పాకుతుంది

ఒంటరి నిశ్శబ్ద ప్రయాణంలో
కనురెప్పలు మూతపడవు
చేతివేళ్లు కదలవు
గాయపడి నెత్తురుకార్చిన గుండె
ఆఖరిసారిగా ఒక్క మాటా మాట్లాడదు
ఒక వేకువ
నేల రాలిపోతుంది

ముసురు తగ్గుతుంది
చిమ్మచీకటి మాత్రం మిగిలే వుంటుంది

రచనా కాలం : 11 జూలై 2017

# ఒకింత సలపరం

మరిచిపోవటం
తడిసిన అక్షరాల జడిలోంచి
శక్తిని కూడదీసుకుని
మళ్లీ నెమ్మదిగా నడవటం
ఒక పని మొదలుపెట్టి
అర్థాంతరంగా ఆగిన తర్వాత
ఏం కానట్టే
తిరిగి నెత్తికెత్తుకోవటం
చెంపలపై కారిన కన్నీటిచారికలను
ఉత్త చేతులతో నీళ్లతో
కడిగేసుకోవటం
ఏదీ, ఏ హృదయ కంపనమూ
కుదురుగా వుండటం లేదు
దిగులు ఆవరించినట్టే ఆవిరించి
చెల్లా చెదురైపోయి
గాలిలేని తిత్తివలే
హృదయం వేళ్లాడుతుంది



బతుకు మీద
చల్లని చేతుల స్పర్శని కూడా
ఎంత త్వరగా అయితే
అంత త్వరగా మరిచిపోతున్నాం
సమాధుల పగుళ్లలోంచి
చూపుల చిగుళ్లను తుంచి
అవతలో ఇవతలో
పడేస్తున్నాం
నిరుడులాగే పాత జీవితాన్నే
మొదలుపెడుతున్నాం
పాత జ్ఞాపకాల్లోనే మిగిలిపోతున్నాం
నిజానికైతే
గడియ గడియకూ
కాలం కరకు పాదల కింద
హృదయం నలిగిపోతుంది
కొత్త వాక్యానికి ప్రాణం పోసేవరకూ
తిరిగి
పునర్జీవనం లేదు

*డా. వి. చంద్రశేఖరరావు గారి స్మృతిలో..*

రచనా కాలం : 9 జూలై 2017

# చిప్పిల్లిన కళ్లు

ఇంటి వాకిలిలో
దయ చిప్పిల్లిన కళ్లనెవరో
వదిలేసి వెళ్లిపోయారా
ఎటువేపు నడిచినా
తడి అంటుకుంటుంది
పాదాలకింత తడి
హృదయానికింత తడి
కన్నులకింత తడి
అంటుకుంటుంది

ఏమో
నిశ్శబ్దంగా ఎవరైనా రోదిస్తూ
నడిచి వెళ్లివుంటారేమో
దారంతా కన్నీళ్ల వూట
నిన్న
ఇంటి ముందు నిల్చొని
వదలిన చెట్టులా



అలా నిల్చునే వుండిన అవ్వ
రాసిన దుఃఖగీతమా
ఏమో
ఎండపూట ఇద్దరు కళ్లులేని అనాథులు
ఒకరి చేతిలో
ఒకరు చేయివేసుకుని
నడిచి వెళ్లినట్టు గుర్తు
వాళ్లవేనా ఈ కన్నీళ్లు
ఏమో

రాత్రంతా నిద్ర లేదు

ఎవరివో ఈ కన్నీళ్లు

ఏడాదిక్రితం
పొయ్యివద్ద అన్నం వండుతూ
కుప్పకూలిపోయిన
ఆ ఆకలితల్లి దృశ్యం
కళ్లముందు చెదిరిపోలేదు
నోరారా అమ్మా అని పిలిచే
మా బడిపిల్లాడి గొంతు
మూగవోయింది

వాకిలిలో కురిసినవి నా కన్నీళ్లేనేమో

రచనా కాలం : 11 మార్చి 2018

# ఒంటరి ఏకాంతదేశంలో

ఎవరూలేని
ఏకాంతదేశంలో
నిశ్శబ్దంగా వాన కురుస్తూ
బొట్లు బొట్లుగా
ఇంటి ముంజూర్ల నుంచి
నేల మీదికి
రాలుతుంది

గాలిలో
వదలిన ఆకు వొకటి
ఎగురుతూ ఎగురుతూ వచ్చి
ముఖాన్ని
తాకుతుంది

ఒకింత చెమ్మేలేని
మట్టిపొరల్లో
ఏ పురాతన గొంతో తెగి



ఆకుపచ్చని శ్వాసని
ఎగబీలుస్తుంది

ఎవరూలేని
ఎవరూలేని
ఎవరూలేని
ఒంటరి ఏకాంతదేశంలో
ఒక కవో, కవి వాక్యమో
తలపైన చేయివేసి
నిమిరి
దగ్గరికి తీసుకుని
హృదయంలో పొదువుకుంటుంది

కనుగుడ్లు చిదిగి
సముద్రం ఉప్పొంగుతుంది

రచనా కాలం : 11 అక్టోబర్ 2017

# కుదుపు

ఒకే ఒక్క మనిషి కోసం
అన్ని పనులూ వదిలిపెట్టి
ఖాళీచేతులతో కనిపించని భారాన్ని మోస్తూ
ఏడేడు సముద్రాలు దాటి వస్తాడు
పుట్టిన గడ్డపైన
బాల్యం పసితనంలోంచి
కాళ్లూ చేతులూ దోగాడించి
ఎంతదూరం పాకాల్సొస్తే
అంత దూరమూ పాకుతాడు
ఉచ్ఛ్వాసనిశ్వాసాల్లో వినిపించే
ఒకే ఒక్క పిలుపు కోసం
పిలిచే చేతుల స్పర్శ కోసం
చేతుల స్పర్శలో రూపుదిద్దుకునే
వెచ్చని గూటి కోసం
ఏడేడు సముద్రాలే కాదు
వేయి సముద్రాలైనా దాటి వస్తాడు

ఒక జ్వరంకాసిన ఉదయం పూట



మంచంపైన అతుక్కుపోయి
కళ్లను ఏ జ్ఞాపకాల ఆవంకిందో
వెచ్చబరుచుకుంటున్న సమయంలో
కబురొస్తుంది
ఉలికిపాటుగా దిగ్గున లేస్తాడు
కబురుతో పాటూ
లోపలి నుంచి ఏడుపూ వస్తుంది
చెంపలపై కారిన కన్నీళ్లు
ఎండిన నదుల్లా గడ్డకడతాయి
తల్లిపేగుల్లోంచి వినిపించే లాలిపాట
ఏ నేల మీదో
బతుకు ప్రయాణంలో అలసిపోయి
సేదతీరుతున్న
అతని ముఖంలో
నీడలు నీడలుగా అల్లుకుంటుంది
ఒక్కో నీడ పొడా
ఒక్కో జ్ఞాపకం
దేహాన్ని మనసుని బిగించి కట్టివేస్తాయి
మెలకువ రాదు
నిద్రా రాదు
హృదయం ముక్కలు ముక్కలౌతున్న
ఒక స్థితి

ఒక్కటే
నిల్చున్న చోటు నుంచి ఎగిరి
అమ్మ ఒడిలోకి వాలిపోవాలి

'ఇంటివైపు' కవి కోసం..

రచనా కాలం : 4 అక్టోబర్ 2017

# ఒక కవి దుఃఖం

నిశ్శబ్దమైపోయాడు
ఇంటి బయట గుమ్మం మీద కూర్చుని
ఏవో నాలుగు వాక్యాలను అల్లుకుంటూ
లోలోన తర్కించుకుంటున్నాడు
కుడ్యాలు లేవు
        కుడ్యాలపై శిల్పాలు లేవు
రంగులు లేవు
        రంగులను చిత్రించే కుంచెలు లేవు
క్షణక్షణం
రగిలిపోతున్నాడు
చీకట్లోకి ముఖం ఆన్చి
వెలుతురును వూహిస్తున్నాడు
ఒక ఖాళీ తెల్లకాగితాన్ని
వేయిరెక్కల సీతాకోకచిలుకగా మలిచిన
సందర్భాలని సన్నివేశాలని
పోగుచేసుకుంటున్నాడు
మళ్లీ మునుపటి కలల కోసం



కలల్లో ప్రవహించే కాంతిపుంజాల తుమ్మెదల కోసం
అనంత జీవితానుభవంలోంచి
ఒక్కొక్క సందర్భాన్ని, ఒక్కొక్క సన్నివేశాన్ని ఏరి
నిశ్శబ్దపుటూయలలో తూగుతున్న
        ఇంటిలోపలికి వెదజల్లుతున్నాడు
అద్భుత కళాఖండాలను సృష్టించిన
                                        చేతివేళ్లు
ఎక్కడో ఏ గదిలోనో
ఏ చీకట్లోనో వున్నాయి
అతను ఒక్కొక్క జీవిత శకలాన్ని
లోపలికి వెదజల్లుతూనే వున్నాడు
వీధిలో
వీధి దీపం చుట్టూ
కాంతి తీగెలకు వేళ్లాడుతూ
తూనీగలూ
        రంగురంగుల కీటకాలూ
తళుకుల మిణుకుల నక్షత్రాలూ

అతను నిశ్శబ్దం నుంచి
మెల్లమెల్లగా తేరుకుంటున్నాడు

రచనా కాలం : 3 అక్టోబర్ 2017

# ఒక ఆధునిక జ్ఞాపకం

ఓ ప్రాచీన ప్రాంతంలో
నడుస్తున్నాను
రోజుల రోజుల తరబడి
ఒకటే కల వెంబడిస్తుంది
గుట్టలు గుట్టలుగా
పోగుబడ్డ రాళ్లొకవైపు
కనుచూపుమేరంతా
పరుచుకున్న ఇసుకపొరలొకవైపు
రేయింబవళ్లూ
దేన్నో వెతుక్కుంటూ వెతుక్కుంటూ
ప్రయాణిస్తున్నాను
రాత్రి ఒడ్డెంబటి పగటిలోకి
పగటి ఒడ్డెంబటి రాత్రిలోకి
తెగిపోకుండా తేలిపోకుండా
నడుస్తున్నాను

దారిలో



పచ్చని పొలాలొకవైపు
బీళ్లొక వైపు
ఎండిన స్తన్యాలొకవైపు
ఎగిసె సంతోషకెరటాలొకవైపు
పిల్లలొక వైపు
ముసలివాళ్లొక వైపు
తుపాకులొకవైపు
సంకెళ్లొక వైపు
పొరలుపొరలుగా రాలుతున్న బతుకులొకవైపు
భ్రమలొకవైపు

దేన్నో
వెతుక్కుంటూ వెతుక్కుంటూ
విరామంలేని ప్రయాణంలో
ఓ ఆధునిక ప్రాంతానికొచ్చాను

లోలోపల్లోంచి
ఒక ఆధునిక జ్ఞాపకం దొలుస్తుంది

రచనా కాలం : 8 అక్టోబర్ 2017

# రెక్కల్లేని

రెక్కలు కత్తిరించారు
పువ్వుపువ్వుపై వాలే సీతాకోకచిలుక
రెక్కలు కత్తిరించారు
ఊరంతా తిరిగి ఊసులు చెప్పే
సీతాకోకచిలుక రెక్కలు కత్తిరించారు
హరివిల్లు రెక్కలతో
ఇల్లు ఇల్లూ తిరిగే
సీతాకోకచిలుక రెక్కలు కత్తిరించారు
గడపగడపపై రంగుల రంగవల్లులేసే
సీతాకోకచిలుక రెక్కలు కత్తిరించారు
కుమిలిపోయింది
          రెక్కల్లేని సీతాకోకచిలుక
అల్లాడిపోయింది
          రెక్కల్లేని సీతాకోకచిలుక
పంజరం ఊచల్లోపల
పుస్తకాలపై వాలివాలి విసుగుచెందింది
రాత్రీపగలూ పుస్తకాలనే పీల్చి
పుస్తకాల్లోనే ఆవిరైపోయింది



పిచ్చి సీతాకోకచిలుక
          అల్లరి సీతాకోకచిలుక
ఒక రోజు
తెగిన రెక్కల్ని
ఒట్టి మొండేన్ని చూసుకుని
కన్నీరుమున్నీరయింది

ఒకానొక చీకటి ఉదయం
రోజూ కనిపించే తీగెనే
మెడకు ఉరేసుకుని
          నేల రాలిపోయింది

రచనా కాలం : 16 అక్టోబర్ 2017

# Unwanted Image 1

ఆటబొమ్మల్లో
బాల్యాన్ని వెతుక్కుంటున్నారు
ఎగరని పక్షుల్లో
ఎగిరే పక్షుల్ని
కదలని  పాముల్లో
కదిలే  పాముల్ని
గాండ్రించని చిరుతల్లో
గాండ్రించే చిరుతల్ని
ప్రాణంలేని  బొమ్మల్లో
ప్రాణాన్ని ప్రతిష్టిస్తున్నారు
ఎగురుతున్నారు
        పాకుతున్నారు
                గాండ్రిస్తున్నారు

ఒకానొక
యాంత్రిక యుగంలో
ఒకానొక పిల్లలు

రచనా కాలం : 3 అక్టోబర్ 2017



# Unwanted Image 2

ఆటబొమ్మలతో
ఆడుకుంటున్నారు
కొనడం, అమ్మడం
అమ్మడం, కొనడం
బేరమాడటం
        బతిమాలాట్టం
జీవితం
అంగడి సరుకైన తర్వాత
పిల్లలూ
మారక  విలువలో
        మాయమైపోతున్నారు

రచనా కాలం : 3 అక్టోబర్ 2017

# అనంత దాహం

కొత్త దేశంలోకి ప్రవేశించాం
పంటలు పండని దేశం
పక్షులు ఎగరని దేశం
గుక్కెడు నీళ్లు తాగి
దాహం తీర్చుకుందామంటే
చిన్న కంత కూడా కనిపించని దేశం
ముళ్లకంచెపైన నిల్చున్నాను
కాలు
అటువైపు వేయలేను
ఇటువైపు వేయలేను
ఎటు వేసినా ముళ్లు
చేతులు మొలవ్వు
కాళ్లు మొలవ్వు
కండ్లల్లో ఒకింత తేమైనా వూరదు
బతుకంతా పగుళ్లు పగుళ్లు



ఏడకో
దారి తెలియని చోటకి
కదలిపోతూ
వూళ్లు

✦ ✦ ✦

దాహం దాహం
అర్ధరాత్రి ఆకలిరాత్రి
నిద్రలో అనంతదాహం

హృదయమొక్కటే
కాస్తా చెమ్మైనా వూరుతుంది

రచనా కాలం : 28 జనవరి 2017

# గాయం

మళ్లీ
చాన్నాళ్ల వరకు
నిశ్శబ్దంగా వుంటాం
రాత్రిని చూస్తూ
నెలవంకని చూస్తూ

పక్కనే
పొలాలనానుకుని
కదిలే వాగునుంచి
నీళ్లు జారుతున్న శబ్దం
చర్మాన్ని తాకుతుంది

నిశ్శబ్దంలో
జోలపాట వినిపిస్తుంది

ఆ రాత్రి
ఎంతకీ నిద్రపట్టదు

*బషారత్ పీర్ రాసిన curfewed night in kashmirను చదువుతూ..*

రచనా కాలం : 4 జూలై 2017



# కలలో, మెలకువలో

గాయపడిన తర్వాత
గొంతు మూగబోతుంది
చేతులు వణుకుతూనే వుంటాయి
ఒక్క అక్షరం ముక్క
బయటకు పెగలదు
వూహించని కెరటం వొకటి
గూడుని చిన్నాభిన్నం చేస్తుంది
హృదయం
కరగని మంచుపెళ్లైపోతుంది
అదే పనిగా
కలలో మెలకువలో
శీతలభ్రాంతి
కెరటం దాటిని తట్టుకోవడం
నీవల్లా కాదు నావల్లా కాదు
మౌనప్రేక్షకుల్లా చూస్తూ
నిల్చోవటం వొక్కటే
మిగులుతుంది

భయం ఉద్వేగం
మూకుమ్మడిగా రక్తనాళాల్లోకి ప్రవేశించి
నిద్రలేని రాత్రిని సృష్టిస్తాయి

*(1990 తర్వాత కశ్మీర్ కవి రషీద్ నజాకి కవిత్వం రాయకపోవటానికి కారణం చదివి..)*

రచనా కాలం : 13 మే 2017



# ఆఫ్రికన్ కవి, నేనూ

ఆఫ్రికన్ కవి
నాతో సంభాషిస్తున్నాడు

నల్లని సముద్రంలాంటి కవి
సముద్రంలో విరిగిపడే
నీలినీలికెరటంలాంటి కవి
నీలినీలి కెరటాల్లో
కనిపించని ముఖంతో
ఎగిసెగిసిపడే కవి

ఆఫ్రికన్ కవి
నాతో సంభాషిస్తున్నాడు

ఆఫ్రికన్ కవితో
నేనూ సంభాషిస్తున్నాను

నల్లని

రేగటి మట్టిని కళ్లకి పూసుకుని
దేన్నో వెతుకులాడుతున్న కలలతో
కలల తీరం వెంబడి నడుస్తూ
పగిలిన కనుగుడ్ల గాయాలతో
పగిలిన కనుగుడ్ల గాయాల గాయాల
గాయాల గానాలతో

ఆఫ్రికన్ కవితో
నేనూ సంభాషిస్తున్నాను

ఈ వూరిచివర
నిల్చొని
సుదీర్ఘంగా
రాత్రుళ్లు రాత్రుళ్లు పైబడి
దేశదేశాల దుఃఖాన్ని
ఇరువురం
పంచుకుంటున్నాం

రచనా కాలం : 20 ఫిబ్రవరి 2017



# ఈ నేలపై

నువ్వొక అనాధవైతే
నా వైపు చూడొద్దు
మేం శరణార్థుల కన్నా ఎక్కువ
ఇళ్లు లేవు
శతాబ్దాల బరువు మా వెనుక వుంది
ఈ చిత్తడి నేలపై
మా పాదముద్రలూ లేవు
ఈ నేలే మాది కానప్పుడు
ఆకాశం గురించి
మేమెలా మాట్లాడగలం

మరాఠీ మూలం: Mina londe, Dalit poet

# 4

నాలుగు గట్ల మధ్య
లేత వరికంకుల కల
లోకం చేతుల్లో వికసించే
సమయం కోసం
వేచి చూస్తున్నాను

నాలుగు గోడల మధ్య
లేత పసిపిల్లల కల
ఈ రెండు చేతుల్లో పూసే
క్షణాల కోసం
వేచిచూస్తున్నాను

# వస్తారని

వస్తారని
ఎదురుచూస్తూ వుంటాం
ఎంతకీ రారు
తలుపు వద్దకు వెళ్లి
దారి వైపు చూస్తాం
ఎవరో వస్తారు
ఎవరో వెళ్తారో
మీరు మాత్రం రారు

పాదు వేసి, గొప్పు తవ్వి, నీళ్లు పెట్టి
తీరా చేవదేరుతున్న దశలో వెళ్లిపోయారు

తరగతి గది
దేశానికి ముఖచిత్రం కావాలన్నారు

తరగతి గది
స్వేచ్ఛాకాంక్షలకు తొలివేదిక కావాలన్నారు

తరగతి గదిని
ఊపిరిలోనూ, ఆలోచనల్లోనూ
నిలుపుకోవడమెలానో
నేర్పారు

నమ్ముతారో, నమ్మరో
మీరు లేరుగాని
నల్లబల్ల తెల్లమొహం వేసింది
సుద్దముక్కలు
రాయడానికి మొరాయిస్తున్నాయి
తరగతి గది
మందలోంచి తప్పిపోయిన
మేకపిల్లలా
బేలగా బెరుగ్గా వుంది

ఆకు కదిలినా, పిట్ట ఎగిరినా
రేపటి సుందరస్వప్నాన్ని కళ్లముందు నిలిపేవారు

పూలు రాలినా, కొమ్మ విరిగినా
కన్నీటి దుఃఖసముద్రంలో మునిగిపోయేవారు

లేరుగాని
ఊహల సీతాకోకచిలుకలు
వున్నట్టుండి
హృదయాల్లోంచి ఎగిరిపోతున్నాయి



ఆశల నక్షత్రవనాలు
అడుగడుక్కి
రెమ్మల్ని రాల్చేస్తున్నాయి

లేరుగాని
అడివి వార్తలు
ఏం తెలియట్లేదు
లాటిన్ అమెరికా
సూర్యోదయాల సంఘటనల్నెవరూ
చెప్పట్లేదు

ఏం బాలేదు

వస్తారని
ఎదురుచూస్తూ వున్నాం

రచనా కాలం : 13 జూలై 2017

# ఎల్లలులేని లోకంలో

నేనొక్కణ్ణే
కాంతిగోళాల్లోంచి చూస్తున్నాను
పిల్లలు ఈలలు వేస్తూ
వలయాలు వలయాలుగా
కదిలిపోతున్నారు
నేనొక్కణ్ణే
ఈ అద్భుత సౌందర్యాన్ని వీక్షిస్తూ
ఎల్లలులేని లోకంలో
ఒక్క క్షణం
    మరొక్క క్షణం
        ఇంకొక్క క్షణం
ఊపిరిపీలుస్తున్నాను

రచనా కాలం : 17 ఆగష్టు 2017



# ఒక తరగతి గది సందర్భం

చిదిగిన అద్దాల్లోంచి
దేశాన్ని వెతుక్కుంటున్నాడా
నిన్నటి గాయాల్లోంచి
రేపటిని చూస్తున్నాడా
ఒక చేయి ఆసరా కావాలి
దేశం కోసమైనా
రేపటి కోసమైనా
అరచేతుల్లోంచి దేశాన్ని
నెత్తుటి గాయాల్లోంచి రేపటిని
మొలకెత్తించగలడు

రచనా కాలం : 13 సెప్టెంబర్ 2017

# పిల్లలు

ఎంతకీ అంతుపట్టరు
ఇద్దరు పిల్లలొచ్చి
హృదయంపైన చల్లని రెండు చినుకులను
కురిసిపోతారు
రెండు లేతచేతులతో
ఒక మొక్కకి ప్రాణం పోస్తున్నట్టు
ఒక మెత్తని మాటని
హృదయంలో నాటి వెళ్లిపోతారు
ఎప్పుడో కలిసిన పిల్లలు
ఎందుకో గుర్తుకు రారు
ఎప్పుడూ కలిసే పిల్లలు
ఎప్పుడో గాని గుర్తుకురారు
పిల్లలు
దేన్నీ మరిచిపోరు
నెమలీకని
పుస్తకం పుటల మధ్య
అపురూపంగా దాచుకున్నట్టే



మనల్ని
వాళ్ల లోపలి పొరల్లో నిక్షిప్తం చేసుకుంటారు
దారిలో కన్పిస్తారు
గాయాలను మాన్పిస్తారు
ఒక్క క్షణమైనా
వాళ్ల వూహలవాకిలిలోకి
చేయి పట్టుకుని
వెంటే వెంటేసుకుని లాక్కుపోతారు
ఎంతకీ అంతుపట్టరు

పిల్లలు పుట్టుకతోనే
ఒక అమూల్యమైన లేపనాన్ని
వెంటబెట్టుకుని వస్తారేమో
వచ్చి
ఎదురైన ప్రతి మనిషి హృదయంపైన
కాస్తా కాస్తా రాసిపోతారేమో

పిల్లల్లో
ఒక లౌకికదేశం, ఒక అలౌకిక స్వప్నం
మళ్లీ మళ్లీ
పుడుతూ వుంటుంది

రచనా కాలం : 13 సెప్టెంబర్ 2017

# నేను లేని తరగతి గది

నేను లేని తరగతి గదిలో
పిల్లలేం చేస్తారు
ఒక్కసారైనా నన్ను జ్ఞాపకం చేసుకుంటారా
ఒక్కసారి కనీసం ఒక్కసారైనా
నన్ను గుండెల నిండుగా
తలచుకుంటారా
నేను లేని తరగతి గదిలో
నెనెలా వుంటానో
నేను లేని తరగతి గది
నేను లేకుండా వుంటుందో, లేదో
తరగతి గది లేని
నేనెలా వుంటాను
నేనూ, తరగతి గది
ఒకరిని వదిలి ఒకరం వుండలేం

నేను లేని తరగతి గదిలో
నా ఆశల వెలుగురవ్వ మోహిని



ఏం చేస్తుందో
నేను లేని తరగతి గదిలో
నరేంద్ర ఏ నిశ్శబ్దనిరాకారంలోకి
కూరిపోయాడో
నేను లేని తరగతి గదిలో
నా ఆనవాళ్ల ఆచూకీ కోసం
ఉమామహేశ్ ఎక్కడెక్కడ
ఏఏ గదుల్లో నన్ను వెతుకుతున్నాడో
నేను లేని తరగతి గదిలో
నేనున్నానో, లేనో

నేనేమిటి
నా తరగతి గది ఏమిటి
తరగతి గదితో నన్ను ముడివేసిన
ఆ అనుబంధం ఏమిటి

నేను లేని తరగతి గదిలో
నా మాటలు ప్రతిధ్వనిస్తాయా
నా ఆలోచనలు పరివ్యాప్తమౌతాయా
నా ఆశయాలు అఖండమార్గాలలో
ప్రయాణిస్తాయా

నేను లేని నా తరగతి గదిని
నా పిల్లలే పూరిస్తారు
ఉమామహేశ్ నా జాడని వెతుక్కొని
నాతోపాటే తరగతి గదిలో శ్రద్ధగా

కూర్చుంటాడు
నరేంద్ర
ఏ కొత్త పరికరాన్నో కనిపెట్టడంలో
నిమగ్నమైపోతాడు
మోహిని
నా అనంతానంత జీవితస్వప్నాన్ని
అణువణువునా నింపుకొని
ఒక ఉద్విగ్నవాతావరణాన్ని
మోసుకుతిరగడంలో
సానదేరుతుంది

నేను లేని తరగతి గది
నేను లేకపోయినా బతుకుతుంది

రచనా కాలం : 20 మార్చి 2017



# ఒకే స్వప్నం కింద

ప్రయాణిస్తున్నంతసేపూ
చిన్నారి కనురెప్పలపైన
తడితడి హృదయం పరుచుకుని వుంది

దేన్లో లీనమౌతూ
దేన్నో జ్ఞాపకం చేసుకుంటూ
ఇద్దరం చెరో దిక్కులో
కూర్చున్నాం

ఒకే నావలో
ఒకే తీరంవైపు సాగుతున్నాం
✦
చుట్టూ
కారాగారం మొలుస్తున్నట్టుంది

ఇంతమంది
మనుషుల ముఖాల్లో

ఒక్క మిణుగురైనా
ఎగరట్లేదు

దయతో ఒక్క మాటకు
ప్రాణం పోస్తారని ఎదురుచూస్తున్నాం

ఒట్టి
ఎదురుచూపే మిగులుతుంది
✦
సరే
అంతా గాయపడినట్టున్నారు

తెలియని వెలితి ఏదో
అందరిలోనూ గుమికూడినట్టుంది

తెరిపినిస్తున్నట్టే వుండి
మబ్బులు ముసురుకుంటున్నాయి
✦
నల్లని దారులగుండా
ప్రయాణం చేస్తూ ఎలాగో గమ్యం చేరాం

కలవాలనుకునే
మనిషిని కలిసిన తర్వాత

చిన్నారి హృదయంలో
తడిగా తడితడిగా, లేలేత పచ్చికలా



దేశమే చిగురించటం మొదలుపెట్టింది
✦
తిరుగు ప్రయాణంలో
చిన్నారి, నేనూ
ఒకే స్వప్నాన్ని మోసుకెళ్తున్నాం

రచనా కాలం : 13 మార్చి 2017

# శివారెడ్డి

కవిత్వం
అల్లుతున్నట్టే
ఇంటిని
అల్లుతున్నాడు
ఆకుల దోనెలో
సాలీడు గూడు నిద్రపోతుంది
ఆకాశం ఒడిలో
నెలవంక మత్తుగా తూలుతుంది
ఒకానొక సముద్రతీరంలో
అతనిలాగానే ఎండ్రకాయ
బొరియలోనికి
వెళ్తూ వస్తూ వుంటుంది
నిత్యం బతుకు ఘోషని వింటూ
మరింత రాటుదేలుతున్నాడు
సూర్యుని కాంతినంతా తోడి
వెలుగుల పూలచెట్టై నిలబడుతున్నాడు
ఎప్పుడో అదృశ్యమైన



అమ్మ చేతివేళ్ల స్పర్శ
వేలచేతులుగా పురివిప్పుతుంది
తల్లి అతనే
తండ్రి అతనే
లేత చిటికెన వేని ప్రపంచంలో
రెపరెపలాడే వేకువ అతనే

భూమి తిరుగుతుంది
ఆకాశం ఉదయిస్తుంది
భూమి ఆకాశాల మధ్య
అవిశ్రాంత ప్రయాణంలో
సేదతీరే నిత్యసంచారి అతనే

ఇంటిని తలపైన ధరించి
కాలం శత్రువుని
ఒట్టి రెక్కలతో జయించడాన్ని
లోకానికి చూపిస్తున్నాడు
ఎన్ని కెరటాలు మోదినా
కదలని రాయి
పుట్టిన వూరి రూపురేఖలతో
నగరంలోనూ
అచ్చం పల్లెతనానికి ప్రతిబింబమై
నిలబడుతున్నాడు

నీలా నాలా
మామూలుగానే గాయపడతాడు

కోలుకుంటాడు
గాయపడతాడు
ప్రతిసారి
ఒక వాక్యంలోకి
వేలనేత్రాలతో విప్పారుతాడు

ఆకు రాలితే కదిలిపోతాడు
పిట్ట ఎగిరితే పొంగిపోతాడు
నడిచిన దారంతా నాలుగు అక్షరాలను నాటి
అల్లుకున్న పాదుల నిండా
విరబూస్తున్నాడు

కిటికీ నుంచి
ఒక వర్షం తుంపర
అతణ్ణి తాకినప్పుడు
తిరిగి
వర్షం జల్లై కురుస్తున్నాడు
దేశదేశాల మట్టిపైన పుష్పించి
నిల్చున్న నేల సౌరభాన్ని
హృదయంలోకి ఒంపుకుంటున్నాడు

ఆకాశమంత చూపుతో
నేలంత ఓర్మితో
ధైర్యవచనంలా ప్రతిధ్వనిస్తున్నాడు

రచనా కాలం : 26 సెప్టెంబర్ 2017



# అతను

నిండా
నీళ్లతో వున్న కావిడిని
భుజమ్మీద వేసుకుని
తొణక్కుండా
కిందికి దించకుండా
నడుస్తున్నాడు
కొండలు ఎక్కుతున్నాడు
లోయలు దిగుతున్నాడు
పర్వత శిఖరాగ్రాలపైనా మహాతేజస్సుతో
సుదీర్ఘయాత్ర చేస్తున్నాడు
మూడు కాలాల్లో
ఆరు రుతువుల్లో
అలసిపోకుండా
ఆగిపోకుండా
ఏకదీక్షతో సాగిపోతున్నాడు
ఎడారుల గుండా
మైదానాల గుండా

దుర్గమారణ్యాల మీదుగా
ప్రయాణం సాగుతుంది
ఎక్కడా ఆవిరైపోలేదు
అడుగంటలేదు
విరామంలేని ప్రయాణంలో
అవిశ్రాంత యోధునిలా సాగిపోతున్నాడు

దారిలో
ఎవరైనా దాహంతో ఎదురొస్తే
దేహాన్ని పిండి
వాళ్ల గొంతులోకి ఒంపుతున్నాడు
దారిలోనే
మనుమలూ పిల్లలూ తల్లులూ
కలుస్తున్నారు
తలా ఇన్ని చుక్కలను
వాళ్ల హృదయాల్లోకే ఒంపుతూ
ముందుకు కదిలిపోతున్నాడు
అప్పుడప్పుడూ
వేళ్లతో కళ్లపైన కాసిన్ని చిలకరించుకుని
సాంత్వన పొందుతున్నాడు

నిండా
నీళ్లతో వున్న కావిడిని
భుజమ్మీద వేసుకుని
తొణక్కుండా
కిందికి దించకుండా



గొప్ప ప్రేమతో గొప్ప త్యాగంతో
బతుకు సాగరాన్ని
జయిస్తున్నాడు

రచనా కాలం : 3 నవంబర్ 2017

# శివారెడ్డి 2

ఎవరో ఒకరు
తోడు లేకపోతే
ఇల్లు గడవదు
నీళ్లలో గ్లాసు ముంచి
నోటికి కాసింత దప్పికను తీర్చడానికైనా
ఒక చేయి ఆసరా కావాలి
కూర్చున్న చోటు నుంచి
లేచి నిలబడి
నాలుగు అడుగులు వేయడానికైనా
ఒక భుజం దన్ను కావాలి
చేయి ఆసరా లేని ఇల్లు
భుజం దన్ను లేని ఇల్లు
ధూళి పట్టి
కనిపించని మొక్కలతో
వింత వాసన
వేస్తూ వుంటుంది



అతని ఓపికకు దణ్ణం
వారం రోజులుగా
యాతనలోంచే మొలకెత్తుతున్నాడు
ఒక కుదుపు
మరొక కుదుపు
ఇంకో పెద్ద కుదుపు
ప్రయాణం
సాఫీగా సాగుతుందనుకోవటం
ఊహల్లోనే
ఏ మాత్రం నిజం కాదనిపిస్తుంటుంది
Life goes in a new way
Let us see
తేలికగా తీసిపారేస్తాడతను
సకల జీవనాడులనూ
ఒక దగ్గరకు పోగుచేసుకుని
రెండు రెక్కలతో ఈదటం, సేదదీరటం
ఈదటం, మళ్లీ ఈదటం
కంటి మీద కునుకులేకపోయినా
కాలం రహదారిపైన
రోజులు దొర్లుతున్నా
శక్తి కృషించదు
ఓపిక నశించదు
ఆసుపత్రిలోంచే
మొలకెత్తుతున్నాడు

'బండి చక్రం
తిరిగినన్నాళ్లూ తిరుగుతుంది

ఒకానొక దశలో
చక్రం పట్టా అరుగుతుంది
సీల ఒసులవుద్ది’
ఒక సాధారణ మాట చెప్తాడే గాని
ఒక అక్షరం చెర్నాకోలా పడేసరికి
కవిత్వం వంతెన మీద
దౌడుతీస్తాడు

రచనా కాలం : 5 అక్టోబర్ 2017



# భరోసా వొకటి

కలిసిన ప్రతిసారి
అతను అడివి నిశ్శబ్దపు గొంతుతో
మాట్లాడుతాడు

ఒక ఆకు
గాల్లో తేలియాడుతూ
నెమ్మదిగా
కళ్లరెప్పలను స్పృషిస్తుంది
ఒక చిరుతెమ్మెర
ఏ చివుళ్లనో తాకి
చేతివేళ్ల మధ్య
సుతారంగా వచ్చి వాలుతుంది

అతణ్ణి
కలిసిన ప్రతిసారి
అతని లోపలి నిశ్శబ్దంలోంచి
ఆదిమ సంగతులేవో

వినిపిస్తాయి
అతణ్ణి
కలిసిన ప్రతిసారి
ఒకానొక ఆకుపచ్చని కలల దేశంలో
రహస్యంగా కురుస్తున్న వానచప్పుళ్లు
గుండె సంద్రాన్ని
వచ్చి మీటుతాయి

నిల్చున్న నేల
రెండుగా చీలిపోతుంది
నడుస్తున్న దారి
తలుపులు మూసుకుని వుంది

ఈ చిమ్మ చీకటిలో
ఎక్కడనుంచో, ఏ అనాధి ఆకాశంలోంచో
కాసిన్ని కిరణాలను తెంపుకొచ్చి
రెండు చేతుల్లో
గుమ్మరించడానికి
అతనొకడున్నాడనే
భరోసా వొకటి మిగిలి వుంది

అతడొకడున్నాడనే
భరోసా వొకటి మిగిలి వుంది

'కాగుతున్న రుతువు' కవి కోసం

రచనా కాలం : 29 మార్చి 2017



# వస్తాడు

వస్తాడు
ముఖంలో వేల చంద్రకిరణాల కాంతితో
ఆకాశంలోంచి
అప్పుడే నేలమీదికొచ్చిన
ఏ కాంతి శిశువుగానో
వస్తూ
రెండు చేతులతో
కోట్ల జలపాతాల హోరుని
మోసుకుని వస్తాడు

వస్తాడు
సాయంత్రపు లేత వరిమొవ్వ నేత్రాలతో
పనిలోంచి అలసటలోంచి
ఒకేసారి లేచి
రివ్వున
వూరి సరిహద్దులు దాటి
లోపలికి చొరబడతాడు

దూరం నుంచే
పసందైన ఒక నవ్వుని విసురుతాడు

వస్తాడు
నేల దేహం మలిచిన దేహంతో
ఇంటిలోంచి వీధిలోంచి
ఆకుపచ్చని జొన్నచేలల్లోంచి
వస్తాడు
వూరి చిట్టచివరి ఇంటిని దాటి
ఏకాంత ద్వీపకల్పంలోకి ప్రవేశిస్తున్న
చిట్టచివరి మానవునిలా
వస్తాడు

ఈ రోజు కూడా వచ్చాడు

రచనా కాలం : 26 అక్టోబర్ 2017



# ఒక కథ

ఇంటి ముందు
పూలకొమ్మపై వాలిన సీతాకోకచిలుక
ఏదో గుర్తొచ్చిన దానివలె
రెక్కలు తిప్పి
గాల్లో ఎటో ఎగిరిపోతుంది
మెత్తని చిన్ని చిన్ని పాదాలతో
మెట్టు నుంచి మెట్టు పైకెక్కి
గుమ్మంలోకొచ్చిన కుక్కపిల్ల
ఏమో తిరిగి వెనకడుగు వేసి
మాయమైపోతుంది
రోజూ
ఇంటింటికీ పాలుపోసే పాలపిల్ల
ఒక పొద్దున్న ఎందుకో
రాదు
ఎక్కడివరకొచ్చి ఎక్కణ్ణుంచి
వెనక్కి వెళ్లిపోయిందో
తెలియదు

కొన్ని క్షణాలు నిశ్శబ్దంగా దొర్లిపోతాయి
లోపల
బయటకు వ్యక్తంకాని వెలితి
గుమికూడి
గాయంగా గూడుకడుతుంది
రాత్రి పడుకునే ముందు
ఆకాశంలో కదిలే ఏ మేఘంలోంచో
ఒక చినుకు ముఖంపై వాలి
వర్షాన్ని గుర్తుచేస్తుంది

ఒక కథ ముగింపుకొస్తూ
కొనసాగుతుంది

రచనా కాలం : 18 ఏప్రిల్ 2018



# సారం

ఉప్పొంగిన అల
ఏ తీరాన్ని చేరుతుందో
కడలి చెబుతుంది

ఎగిరెళ్లిన పక్షి
ఏ కొమ్మపై వాలుతుందో
చెట్టు చెబుతుంది

చెదిరిన మబ్బు
ఏ నేలని తడుపుతుందో
నింగి చెబుతుంది

విడిచిన బాణం
ఏ దూరాన్ని కరిగిస్తుందో
విల్లు చెబుతుంది

తెగిన పాట

ఏ హృదయాన్ని రగిలిస్తుందో
నెత్తురు చెబుతుంది

భూమి సారమంతా
భూమి అంతఃప్పొరల్లోనే వుంది

రచనా కాలం : 25 నవంబర్ 2017



# వర్షం

మేఘాల భాషలోకి
మేం ప్రవేశించాం
వాతావరణం అంతటా
ఒక్కలాగే వుంది
గొడుగును వేస్తావా
వర్షాన్ని ఆపేస్తావా

మన చేతుల్లో
మన పిల్లలు ఆడుకునే
బొమ్మలు మాత్రమే
మిగిలి వున్నాయి

పాలస్తీనా మూలం : Ghassan Zagtan